సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 21-7-2023 15/-


# పస్మాందా రాజకీయం





జగతికి జీవనాడి ఖుర్ఆన్




ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు పర్యావరణానికి పనికొస్తాయా?

సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 29 హైదరాబాద్
శుక్రవారం 21 జులై 2023 రూ.15-00
2 ముహర్రం 1445 హిజ్రీ


**తొలిగీటు**

ఎవరయితే ఇతరుల జానెడు భూభాగాన్ని అన్యాయంగా దోచుకుంటారో అల్లాహ్, ప్రళయ దినాన ఏడు భూముల భారం అతని మెడలో వ్రేలాడవేస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
ఎస్.ఎమ్. మలిక్

**అసోసియేట్ ఎడిటర్**
అబ్దుల్ వాహెద్

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
ముహమ్మద్ ముజాహిద్

**సబ్ ఎడిటర్**
యాఖూబ్ షర్ఫీ

**గ్రాఫిక్స్**
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

**సర్క్యులేషన్ మేనేజర్**
అబ్దుల్ జలీల్, 9704317015

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


కథ



14

**బంగారు పంట**

## లోపల...


| | | |
|---|---|---|
| మద్యం మహమ్మారి | ...... | 04 |
| పస్మాందా రాజకీయం | ...... | 05 |
| జగతికి జీవనాడి ఖుర్ఆన్ | ...... | 09 |
| ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు పర్యావరణానికి పనికొస్తాయా? | ...... | 12 |
| చరితార్థులు–2 : మౌలానా ముహమ్మద్ బాఖర్ | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| సర్వకాలిక ఆదర్శం | ...... | 20 |
| గర్వభంగం | ..... | 24 |
| ఫేక్‌న్యూస్ రౌండప్ | ..... | 27 |
| సుందరాంగులు | ...... | 28 |
| యూనిఫాం సివిల్‌కోడ్‌పై ... అభ్యంతరాలు | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| మహిళలకు మంచి నగరాలు | ...... | 34 |


**కుర్చీ కొడుక్కేనట..?**




బీయ్యారెస్ గెలిస్తే
కేటియారు సీయం
పైకి చెప్పకున్నగాని
లోలోపలంత సిద్ధం!
కొడుక్కి కుర్చీయిచ్చి
తనుబోతడంట ఢిల్లీ
పథకం బెడిసిందంటే
వెనుదిరుగుడె మళ్ళీ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# మద్యం మహమ్మారి

**ఫ్రామింగ్హామ్ హార్ట్ స్టడీ** అనే అధ్యయనం 1948లో ప్రారంభమైంది. ఆల్కాహాల్ వల్ల మనిషి ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని ఈ అధ్యయనంలో పరిశీలించారు. ఈ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొద్దిపాటి ఆల్కాహాల్ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే అనే అభిప్రాయం కూడా ఏర్పడింది. మద్యపానం చేయని వారికంటే కొద్దిగా మద్యం సేవించేవారికి గుండె జబ్బుల ప్రమాదం కొంత తక్కువ అని అధ్యయనం చెప్పింది కాబట్టి ఈ అభిప్రాయం ప్రచారంలోకి వచ్చింది. కాని వాస్తవమేమిటంటే, అదే అధ్యయనం మరో విషయాన్ని కూడా చెప్పింది. మహిళలు కొద్దిపాటి ఆల్కాహాల్ తీసుకున్నా వారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ అవుతాయి. నిజానికి మద్యపానం విషయంలో అబద్దాలు ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. 'ది క్వింట్'లో వచ్చిన ఒక వ్యాసం బోస్టన్ యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ రిచర్డ్ సాజ్ ప్రకారం ఆల్కాహాల్ ఎంత తక్కువ తీసుకున్నా అది క్యాన్సర్ కారకం అవుతుంది. దీనివల్ల గుండెజబ్బుల ప్రమాదం తగ్గుతుందన్న మాటలో నిజం లేనే లేదు.

ఈ విషయాలు చదివినప్పుడు దివ్యఖుర్ఆన్లోని ఒక మాట గుర్తుకు వస్తుంది.

ప్రవక్తా, ప్రజలు నిన్ను మద్యపానం గురించి, జూదం గురించి ప్రశ్నిస్తున్నారు. నీవు వారికి చెప్పు, రెండింటిలోను చాలా పెద్ద పాపం ఉంది. ప్రజలకు దీనివల్ల కొన్ని ప్రాపంచిక లాభాలు కలుగుతాయి, కాని వీటి ద్వారా చేకూరే లాభం కన్నా పాపం చాలా ఎక్కువ *(దివ్యఖుర్ఆన్: 2:219)*

ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన ఒక మాట కూడా తప్పక గుర్తుకు వస్తుంది. అదేమిటంటే, "చాలా పెద్ద మోతాదులో సేవించినా కూడా చాలా తక్కువ మత్తు కలిగించే పదార్థమైనా గానీ దాన్ని అతి తక్కువ మోతాదులో సేవించడం కూడా నిషిద్ధం."

దివ్యఖుర్ఆన్ వాక్యంలో పేర్కొన్న కొన్ని లాభాలు కనిపిస్తాయి అనే మాటలు, ప్రవక్త (స) చెప్పిన మాటల్లో అతి తక్కువ పరిమాణంలో కూడా నిషిద్ధమే అన్న మాటలు గమనించదగినవి. ఈ మాటల్లోని సత్యాలు ఇప్పుడు అధ్యయనాల్లో బయటపడుతున్నాయి. బ్రిటన్లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం కొద్ది మోతాదులో మద్యం పుచ్చుకున్నా మెదడులో మార్పులు వస్తాయి. ఈ మార్పులు మనిషి మేధోశక్తిని దెబ్బతీస్తాయి. ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ అధ్యయనం ప్రకారం మద్యపానం చాలా తక్కువగా చేసినా మెదడులో ఇనుము పేరుకుపోవడం జరుగుతుంది. ఆ ప్రభావం మెదడును దెబ్బతీస్తుంది. యాంగ్జయిటీ వంటివి ఉన్నవారికి మద్యపానం తర్వాత ఒత్తిడి ఉపశమనం లాంటిది కలుగుతుంది. అందువల్ల గుండెజబ్బులు తగ్గుతాయన్నది ఒక అభిప్రాయం మాత్రమే, కాని యాంగ్జయిటీ స్వయంగా మనిషి గుండెను దెబ్బతీస్తుందని ఇప్పుడు భావిస్తున్నారు. మద్యపానంలో కొన్ని లాభాలు కలుగుతాయి, కాని ఇది చాలా పెద్దపాపం అనే దివ్యఖుర్ఆన్ వాక్యం ఇక్కడ ఎంతో అర్థవంతంగా కనిపిస్తోంది.

జర్నల్ ఆఫ్ అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీలో ఇటీవల జరిగిన ఒక అధ్యయనం గురించి రాశారు. మద్యపానం విషయంలో సురక్షితమైన స్థాయి అంటూ ఏదీ లేదని చెప్పారు. అంటే ఎంత తక్కువైనా సరే అది ప్రమాదకరమే. మద్యపాన వ్యాపారం చాలా పెద్దది. భారీ ధనరాసులు ఇందులో ఉన్నాయి. అందువల్ల అబద్దాలు ప్రచారంలో పెట్టడం కష్టంకాదు. 2021లో ఫ్రెంచ్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సర్వేలో చాలా మంది కొద్దిపాటి ఆల్కాహాల్ మంచిదే అని అభిప్రాయపడ్డారు. కాని సైంటిఫిక్ పరిశోధనల్లో తెలిసిందేమిటంటే ప్రపంచంలో క్యాన్సర్కు ముఖ్యమైన కారణాల్లో మద్యం రెండవది.

కాబట్టి ఆరోగ్యానికి మంచిది అనే స్థాయి ఏదీ ఆల్కాహాల్ విషయంలో లేనేలేదు. ఎంత తక్కువైనా అది హానికరమే. మత్తు కలిగించేది ఏదైనా ప్రమాదకరమే. ఇస్లాం అందుకే వాటన్నింటిని నిషేధించింది. ఈ నిషేధం ఎలాంటిదంటే, మద్యంతో ఎలాంటి సంబంధం కలిగి ఉన్నవారైనా, మద్యం తయారు చేసేవారు, మద్యం తాగేవారు, మద్యాన్ని రవాణా చేసేవారు, మద్యాన్ని అందించేవారు, మద్యాన్ని అమ్మేవారు, మద్యం అమ్మి ప్రయోజనాలు పొందేవారు, మద్యాన్ని కొనేవారు, ఎవరి కోసం మద్యం కొనడం జరిగిందో వారు ... వీరందరినీ ప్రవక్త ముహమ్మద్ (స) ఒక హదీసులో అధిక్షేపించారు.

సకల రుగ్మతలకు మూలం మద్యపానమే. సమాజంలో నేరాలకు ఘోరాలకు కారణం మద్యపానమే. అలాంటి మద్యపానాన్ని ఇస్లాం కఠినంగా నిషేధించడంలో ఔచిత్యాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. ■

అబ్దుల్ వాహెద్



# పస్మాందా రాజకీయం

**ప్రధాని నరేంద్రమోడీ** ఇటీవల పస్మాందా ముస్లిముల గురించి మాట్లాడారు. పస్మాందా అంటే వెనుకబడిన అని అర్థం. ముస్లిముల్లో వెనుకబడిన సముదాయాలకు చెందిన పస్మాందా ముస్లిముల పట్ల సానుభూతి చూపించారు. వారి కష్టాలను ఎవరు పట్టించుకోలేదన్నారు. జూన్ 27వ తేదీన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ మాటలు చెప్పారు. అంతకు ముందు కూడా ఒక సందర్భంలో ఆయన పస్మాందా ముస్లిముల గురించి మాట్లాడారు. పస్మాందా ముస్లిముల సంక్షేమం కోసం బీజేపీ చాలా పని చేస్తోందని చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ పేరు చెప్పి ముస్లిములను తప్పుదారి పట్టించి కొన్ని శక్తులు రెచ్చగొడుతున్నాయని కూడా అన్నారు. ఒక దేశం రెండు చట్టాలతో ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. దేశంలో అనేక ప్రాంతాల్లో చట్టాలు వివిధ రకాలుగా ఉన్నాయన్నది ప్రత్యేకంగా ఇక్కడ ప్రస్తావించనవసరం లేదు. అలాగే ఆయన త్రిపుల్ తలాక్ గురించి కూడా మాట్లాడారు. త్రిపుల్ తలాక్ ను సమర్థించేవారు ముస్లిం మహిళలకు తీవ్రఅన్యాయం చేస్తున్నారని చెప్పారు. పస్మాందా ముస్లిములను ఓటు బ్యాంకు రాజకీయాలతో సమానంగా చూడడం లేదని ఆరోపించారు.

కాని పస్మాందా ముస్లిము సంస్థలు ఈ మాటలను నమ్మడం లేదు. పస్మాందా ముస్లిం సమాజ్ జాతీయాధ్యక్షుడు అనీస్ మన్సూరీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ముస్లిముల్లో వెనుకబడిన సముదాయాలకు చెందిన వారి సంక్షేమానికి చేసింది ఏదీ లేదని కుండబద్దలు కొట్టారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పస్మాందా ముస్లిముల సంక్షేమ పథకాలు అమలు చేయాలని

డిమాండ్ చేశారు. అలాగే యూనిఫాం సివిల్ కోడ్ అవసరమేమి టని కూడా ఆయన ప్రశ్నించాడు. దేశంలో శతాబ్దాలుగా వివిధ మతాలు, కులాల ప్రజలు తమ తమ వ్యక్తిగత చట్టాలను పాటిస్తూ ఎలాంటి వివాదాలు లేకుండా జీవిస్తున్నప్పుడు యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావలసిన అవసరమేమిటన్నారు. ప్రధాని మోడీ హామీలను పస్మాందా ముస్లిములు నమ్మాలంటే లోక్ సభ ఎన్నిక లకు ముందు పస్మాందా ముస్లిముల సంక్షేమానికి సమగ్రపథకం అమలు చేసి చూపించాలని చెప్పారు.

గత సంవత్సరం జులై 3వ తేదీన కూడా ప్రధాని నరేంద్రమోడీ పస్మాందా ముస్లిముల గురించి తన సానుభూతి ప్రకటిస్తూ మాట్లాడారని, హైదరాబాదులో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మాటలుచెప్పారని, కాని ఒక సంవత్సరం గడిచి పోయిందని, ఇప్పటి వరకు ప్రధాని మోడీ పస్మాందా ముస్లిముల ప్రగతి వికాసాలకోసం చేసింది ఏదీ లేదని అనీస్ మన్సూరీ గుర్తు చేశారు. ముస్లిముల్లో వెనుకబడిన సముదాయాల సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి ప్రధానికి ఉంటే ఆయన నిజాయితిగా ఒక సమగ్ర పథకాన్ని రూపొందించి 2024 లోక్ సభ ఎన్నికలకన్నా ముందు అమలు చేసి చూపించాలని కోరారు. అప్పుడే పస్మాందా ముస్లిములు ప్రధాని మాటలు నమ్మగలరని చెప్పారు.

పస్మాందా ముస్లిముల్లో అన్సారీలు, ఖురైషీలు, మన్సూరీలు, సల్మానీలు, సిద్దీకులు ఇలా అనేక సముదాయాలున్నాయి. మాంసం వ్యాపారం, చేనేత తదితర వృత్తుల్లో ఉన్నారు. వారి అభివృద్ధికి ప్రధాని మోడీ తీసుకున్న చర్యలేవీ ఇంత వరకు ముందుకు రాలేదు.

అనీస్ మన్సూరీ మాత్రమే కాదు, ఈ మాటలు ఇంకా చాలామంది చెబుతున్నారు. భోపాల్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త డా. అలీ అబ్బాస్ ఉమ్మీద్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఈ సంవత్సరం ముగిసే నాటికి మధ్యప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగవలసి ఉంది. వచ్చే సంవత్సరం లోక్‌సభ ఎన్నికలున్నాయి. ఇది ఎన్నికల సీజను. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ పస్మాందా ముస్లిముల రక్షకుడిగా ముందుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. యూనిఫాం సివిల్ కోడ్, త్రిపుల్ తలాక్‌వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. త్రిపుల్ తలాక్ చట్టం వచ్చిన తర్వాతి నుంచి ఇప్పటి వరకు ముస్లిం మహిళలకు దానివల్ల ఒనగూడిన ప్రయోజనాలేమిటో గణాంకాలతో ప్రభుత్వం చెప్పగలిగే స్థితిలో ఉందా?

ఈ నేపథ్యంలో డా. ఉమ్మీద్ అనేక ప్రశ్నలు సంధించారు. పస్మాందా లేదా వెనుకబడిన ముస్లిం సముదాయాలు బీజేపీయేతర ప్రభుత్వాల వల్ల నష్టపోయాయని, మోసానికి గురయ్యాయని అనుకున్నా, కేంద్రంలో బీజేపీ వచ్చిన తర్వాత చేసిందేముందని ప్రశ్నించారు. వెనుకబడిన ముస్లిం విద్యార్థుల స్కాలర్ షిప్పులను ఎందుకు ఆపేశారని ఆయన ప్రశ్నించాడు. పేద వెనుకబడిన ముస్లిం సముదాయాలకు ఇచ్చే స్వయం ఉపాధి సహాయంలో సబ్సిడీని ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు.

ప్రస్తుతం బీజేపీ దేశంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న 65 లోక్ సభ్ నియోజకవర్గాలపై దృష్టి పెట్టింది. ఈ నియోజకవర్గాల్లో పస్మాందా ముస్లిములుగా పిలువబడే ముస్లిం వెనుకబడిన సముదాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కాని కాస్త గమనిస్తే ప్రభుత్వ సంక్షేమపథకాలు ఏవైనా అమలైతే వాటిని అందుకునేది ఈ వర్గాలే. ఆ పథకాలనే బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ వస్తోంది. మరోవైపు ఈ వర్గాలను ఆదుకునే ఏకైక పార్టీగా చెప్పుకునే ప్రయత్నాలు చేస్తోంది. దేశంలో ముస్లిం సముదాయం మొత్తం వెనుకబాటుకు గురైన సమాజం. ఇందులో కొన్ని తరగతుల ప్రజలు మరింత ఎక్కువగా వెనుకబాటుకు గురయ్యారు.




పస్మాందా అంటే అర్థం వెనుకబడిన అని. డా. అలీ అన్సారీ ఉమ్మీద్ ఆల్ ఇండియా పస్మాందా ముస్లిం మహాజ్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కూడాను. పస్మాందా ముస్లిముల పరిస్థితి గురించి పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి. ఆయన ప్రధాని మోడీని ఈ విషయమై తీవ్రంగా విమర్శించారు.

యుపిఏ అధికారంలో ఉన్నప్పుడు దేశంలోని 99 జిల్లాలను మైనారిటీ జనాభా అధికంగా ఉన్న జిల్లాలుగా గుర్తించింది. ప్రతి జిల్లాకు ఏటా 15 కోట్ల రూపాయల నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించడం ప్రారంభించింది. ఆ స్కీమును బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు ఆపేశారని డా.ఉమ్మీద్ ప్రశ్నించారు. అలాగే మదరసాల గురించి చాలా గగ్గోలు జరుగుతుంటుంది. మదరసాల్లో చదివే పిల్లల్లో చాలా మంది పస్మాందా సముదాయాలకు చెందినవారే. మదరసాలకు గ్రాంటులను ఎందుకు ఆపేశారని డా. ఉమ్మీద్ ప్రశ్నించారు. జాతీయ మైనారిటీ కమీషన్‌లో ఎందుకు నియామకాలు జరగడం లేదు? నేషనల్ మైనారిటీస్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పస్మాందా ముస్లిములకు ఎందుకు ప్రయోజనాలు లభించడం లేదని? ఆయన ప్రశ్నిస్తున్నారు.

సుప్రీంకోర్టు మస్జిదు ఇమాములకు జీతాలివ్వాలని 30 సంవత్సరాల క్రితమే తీర్పు చెప్పింది. వారికి జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు 1993లో ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ పిటీషన్ పై తీర్పు చెబుతూ వక్ఫ్ బోర్డుకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్ బోర్డు నిర్వహించే మస్జిదుల్లో ఇమాములకు పారితోషికాలు చెల్లించాలని పేర్కొంది.

పస్మాందా ముస్లిముల సమస్యల గురించి ప్రధాని లేవనెత్తిన సమస్యలన్నింటికి సమాధానం ఆయన ప్రభుత్వం వద్దనే ఉందని డా.ఉమ్మీద్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే. డా. ఉమ్మీద్ కూడా భోపాల్‌కు చెందినవారు. తన రాష్ట్రం గురించే ఆయన మాట్లాడుతూ, మధ్యప్రదేశ్ లో పస్మాందా ముస్లిముల కోసం అక్కడి ముఖ్యమంత్రి ఏం చేశారో చెప్పాలన్నారు. ముస్లిముల్లో వెనుకబడిన సముదాయాల పిల్లలకు ఎంతమందికి స్కాలర్‌షిప్పులు ఇచ్చారు? పస్మాందా ముస్లిం పిల్లలు చదువుకునే ఎన్ని మదరసాలకు సహాయం అందించారు? పస్మాందా ముస్లిముల కుటీర పరిశ్రమలకు ఎంత సహాయం అందించారు? వంటి అనేక ప్రశ్నలు ఆయన సంధించారు.

మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభుత్వం అక్కడ మైనారిటీ కమీషన్ ఎందుకు నియమించలేదు? భోపాల్ మస్జిద్ కమిటీలో ఎందుకు నియామకాలు లేవు? మధ్యప్రదేశ్ స్టేట్ మదరసా బోర్డులో ఎందుకు నియామకాలు లేవు? మధ్యప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషనులో ఎందుకు నియామకాలు లేవు? మధ్యప్రదేశ్ లోని మదరసాలకు గత 3 సంవత్సరాలుగా గ్రాంటులు అందడం లేదు. ఈ మదరసాల్లో 85 శాతం ముస్లిం వెనుకబడిన సముదాయాలవే, అక్కడి టీచర్లు పిల్లలు ముఖ్యంగా ముస్లిం వెనుకబడిన సముదాయాల వారే అని డా.ఉమ్మీద్ అన్నారు.

పస్మాందా ముస్లిం సముదాయాల్లో ఖురైషీలు చాలా పెద్ద సముదాయమని, మాంసవిక్రయం వృత్తిగా జీవిస్తున్నారని, మాంసం, ఎముకలు, పశువుల తోలు వ్యాపారాలు చేస్తుంటారని చెబుతూ బీజేపీ విధానాలు వారి జీవికను దెబ్బతీశాయని చెప్పారు. గోరక్షక దళాల పేరుతో మాంసవిక్రేతలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వాతావరణం అందరికీ తెలిసిందే. ముస్లిములతో పాటు దళితులు కూడా దీనివల్ల నష్టానికి గురయ్యారు. డా. ఉమ్మీద్ మాట్లాడుతూ తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని, కాని 80 వర్సెస్ 20 రాజకీయాల క్రీడ ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభించారని, ఇదే రాజకీయ క్రీడ ఇప్పుడు మరోవిధంగా రాబోయే లోకసభ ఎన్నికల కోసం ప్రయోగిస్తున్నారని చెప్పారు. నిజానికి ముస్లిముల్లో కులవిభేదాలు, కుల వివక్షలు లేవని, ముస్లిములందరి ఆహార అలవాట్లు ఒకటేనని, ఒకే పంక్తిన ఎవరితో అయినా కలిసి భోంచేస్తారని, నమాజులో పక్కపక్కనే నిలబడి ప్రార్థిస్తారని సామాజిక, ఆర్థిక అంతరాలేవీ ఇక్కడ కనిపించవని ఆయన అన్నారు. ప్రధాని మోడీ ముస్లిముల్లో వెనుకబడిన సముదాయాల అభివృద్ధి విషయంలో చిత్తశుద్ధి కలిగి ఉంటే ముస్లిముల సంక్షేమ పథకాలను ఎందుకు ఆపేశారో చెప్పాలని ప్రశ్నించారు.

ఇస్లాంలో సైద్ధాంతికంగా కులాలు లేవు, నిమ్నోన్నతలు లేవు. కాని ఆచరణలో కొన్ని అంతరాలు కనిపిస్తున్నాయన్నది నిజమే. పస్మాందా ముస్లిములు అంటరానివారుగా ఉన్నారని ప్రధాని మోడీ చెప్పిన మాట వాస్తవమా? నిజానికి అలాంటి తీవ్రమైన కులాల నిచ్చెన ఇస్లామ్‌లో లేదని స్వయంగా ఆయన నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వమే సుప్రీంకోర్టులో నవంబర్ 2022లో ఒక అఫిడవిట్ ద్వారా తెలియజేసింది. ఇస్లాములో, క్రయిస్తవంలో అంటరానితనం లేదని చెప్పింది. ఈ అఫిడవిట్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వవలసి వచ్చిందంటే, ఇస్లాములోకి, క్రయిస్తవంలోకి మతం మార్చుకున్న దళితులు యస్సీ హోదా కావాలని డిమాండ్ చేసిన పిటీషన్‌కు ప్రతిస్పందనగా ఈ అఫిడవిట్ ప్రభుత్వం దాఖలు చేసింది. ఇస్లాములో, క్రయిస్తవంలో అంటరానితనం లేదు కాబట్టి వారికి యస్సీ హోదా ఇవ్వడం కుదరదని ప్రభుత్వం చెప్పింది. కాని ఇప్పుడు ప్రధాని బాహాటంగా ముస్లిముల్లో కొన్ని సముదాయాలు అంటరానితనానికి గురయ్యాయని అంటు

న్నారు. అంటే ఇప్పుడు ఆయన వారికి యస్టీ హోదాను కూడా ఒప్పుకుంటారా?

బీహారు ముఖ్యమంత్రి ప్రారంభించిన కులగణన జనాభా లెక్కల గురించి కూడా ఇక్కడ మాట్లాడుకోవాలి. కాని కులగణనను నరేంద్రమోడీ ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. కులగణన వల్ల వివిధ కులసముదాయాల్లో పేదరికం ఏ స్థాయిలో ఉందో స్పష్టంగా తెలుస్తుంది. వారి ప్రగతి వికాసాల కోసం ఎలాంటి కార్యాచరణ పథకాలు అవసరమో నిర్ణయించడానికి వెసులు బాటు లభిస్తుంది. ఈ కులగణన జరిగితే పస్మాందా ముస్లిముల సంఖ్య వారి పరిస్థితి గురించి పూర్తి వివరాలు ముందుకు వస్తాయి. కాని మోదీ ప్రభుత్వం దానికి సిద్ధంగా లేదు. కాని రాజకీయ ప్రయోజనాల కోసం పస్మాందా ముస్లిములను మభ్య పెట్టి తనవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రయత్నాలను ఈ సముదాయాలు గుర్తించి తిప్పికొడుతున్నాయి.

రాజ్యసభ మాజీ సభ్యుడు, పస్మాందా ముస్లిం మహాజ్ నాయకుడు అలీ అన్వర్ అన్సారీ చెప్పిన మాటలు కూడా ఇక్కడ గమనార్హమైనవి. హైదరాబాద్ లో బీజేపీ కార్యవర్గ సమావేశంలో ప్రధాని మోడీ పస్మాందా ముస్లిముల గురించి మాట్లాడిన తర్వాత అలీ అన్వర్ అన్సారీ మాట్లాడుతూ ఇంతవరకు ఎన్నడూ వెనుకబడిన ముస్లిముల పట్ల దృష్టి పెట్టని బీజేపీ ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు స్నేహయాత్రలు ప్రారంభించిందని ప్రశ్నించారు. పస్మాందా ముస్లిములకు కావలసింది సన్మాన్ అంతే తప్ప స్నేహ యాత్రలు కాదని ఖరాఖండిగా చెప్పారు. పస్మాందా ముస్లిములపై జరుగుతున్న దౌర్జన్యాలను ఆపకుండా ఈ స్నేహయాత్రలు అర్థరహితమైనవని కూడా చెప్పారు. విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలు ఒకవైపు వినిపిస్తుంటే, బుల్డోజర్లతో ఇండ్లు కూలగొడుతుంటే ఈ వాతావరణంలో ప్రధాని మాటలు అర్థం లేనివని చెప్పారు. గోరక్ష, ఘర్ వాపసి, లవ్ జిహాద్, తబ్లీగీ జిహాద్ (కరోనా కాలంలో), మస్జిద్ మందిర వివాదాలు వీటన్నింటిలోను అత్యంత నష్టపోయినవారు, కష్టాలకు గురైన వారు, ప్రాణాలు కోల్పోయినవారిలో పస్మాందా ముస్లిములే పెద్ద సంఖ్యలో ఉన్నారని ఆయన అన్నారు. ఈ సంఘటనల్లో చంప బడినవారు, పోలీసు కేసుల్లో ఇరికించబడినవారు, జైళ్ళపాలైన వారిలో కూడా పస్మాందా ముస్లిములే ఎక్కువ అని చెప్పారు.

ఏది ఏమైనా అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే, ముస్లిముల ఓట్లే మాకు అవసరం లేదని బీజేపీ నేతలు చెప్పిన మాటలు చాలా మందికి గుర్తుండే ఉంటాయి. ఇప్పుడు పస్మాందా ముస్లిముల ఓట్లు అవసరమనే పరిస్థితిలో బీజేపీ ఉందన్నది నేటి వాస్తవం. బీజేపీ అంటే ఎన్నికల యుద్ధ యంత్రమని, ఈ రథం విజయరథమని 2014 నుంచి వినిపిస్తూ వస్తున్న మాటలు ఇప్పుడు కాస్త బలహీనమైపోయాయి. కర్నాటక ఎన్నికలకు ముందు బీజేపీ కాస్త బలంగానే ఉండేది. తెలంగాణలో బీఆరెస్‌కు అసలు పోటీ బీజేపీయే అనే స్థాయికి చేరుకుంది. కాని కర్నాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో అసలు పోటీ కాంగ్రెస్ ఇస్తుందే కాని బీజేపీ కాదనే దశ వచ్చింది. ఇప్పుడు కూడా అనేక రాష్ట్రాల్లో బీజేపీ పార్టీ మార్పిడి నేతలను తనవైపు తిప్పుకోవడం పైనే ఎక్కువగా ఆధారపడుతోంది. స్వంతంగా బలం పెంచుకుని ప్రజల్లోకి వెళ్ళడం తక్కువ. వివిధ సముదాయాలను ఆకట్టుకోడానికి ఎన్నికల జుమ్లాలు చెప్పడం కూడా పార్టీ వ్యూహంలో భాగమే. ఇప్పుడు పస్మాందా రాజకీయాల వెనుక కూడా ఇలాంటి ఎన్నికల వ్యూహాలు తప్పమరేమీ లేవని పలువురు విశ్లేషకుల అభిప్రాయం.

★★★



**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# జగతికి జీవనాడి ఖుర్ఆన్

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**శక్తివంతమైన జాతి వద్ద ఉన్న గ్రంథం కాదు ఖుర్ఆన్, జాతుల్ని శక్తివంతం చేసే గ్రంథం ఖుర్ఆన్. సుహుఫ్ – తౌరాత్ఫ్, జబూర్, ఇంజీల్ – దైవ గ్రంథాలే, కానీ అన్నీ కాలాల్లో ఆచరణీయాలు కావు. ఎందుకంటే – అన్ని గ్రంథాల సారాంశాన్ని సంరక్షించే గ్రంథరాజం ఒకటుంది– అదే అల్లాహ్ అంతిమ గ్రంథం ఖుర్ఆన్.**

తౌరాత్‌లో మేము యూదులకు ఈ ఉత్తర్వు జారీ చేశాము: .... వినండి, అల్లాహ్ నిర్దేశించిన చట్టంప్రకారం పరిష్కారం చేయనివారే దుర్మార్గులు. *(మాయిదహ్: 45)*

ఆ ప్రవక్తల తర్వాత మేము మర్యం కుమారుడు ఈసాను పంపాము. అతను తనకు పూర్వం నుండీ వున్న తౌరాత్‌ను ధృవీకరించేవాడు. అతనికి మేము కాంతి, సన్మార్గం గల ఇన్జీల్‌ని ప్రసాదించాం. అది కూడా గతంలో వచ్చిన తౌరాత్‌ను ధృవీకరిస్తుంది. అది దైవభీతిపరుల పాలిట వెలుగుబాట, హితోపదేశం. ఇన్జీల్‌ప్రజలు అందులో అల్లాహ్ నిర్దేశించిన చట్టం ప్రకారమే పరిష్కరించుకోవాలని మేము ఆదేశించాం. కనుక అల్లాహ్ నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే దుర్జనులు. *(మాయిదహ్: 46-47)*

చివరికి మేము సత్యపూరితమైన ఈ గ్రంథం (ఖుర్ఆన్) నీపై అవతరింపజేశాం. ఇది ఇంతకు పూర్వం వచ్చిన దివ్యగ్రంథాలను ధృవీకరిస్తోంది. వాటన్నిటి సారాంశం కలిగి ఉంది. కనుక నీవు దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారమే ప్రజల వ్యవహారాలు

పరిష్కరించు. నీ దగ్గరకు వచ్చిన సత్యాన్ని వదిలేసి వారి మనో కాంక్షలను అనుసరించకు. *(మాయిదహ్: 46-47)*

మేము మీలో ప్రతి సముదాయానికి ఓ ప్రత్యేక ధర్మశాస్త్రాన్ని, ఓ ప్రత్యేక ఆచరణ విధానాన్ని నిర్ణయించాం. అల్లాహ్ తలచు కుంటే మిమ్మల్నందర్నీ ఒకే సముదాయంగా కూడా చేయగలడు. కాని ఆయన మిమ్మల్ని పరీక్షించడానికి విభిన్న సముదాయాలుగా చేశాడు. కనుక మీరు సత్కార్యాల్లో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించండి. చివరికి మీరంతా అల్లాహ్ సన్నిధికే చేరుకో వలసి ఉంది. తర్వాత మీరు ఏ విషయాల్లో పరస్పరం విభేదించు కున్నారో వాటి వాస్తవికతను ఆయన మీకు తెలియజేస్తాడు. *(మాయిదహ్: 48)*

ఖుర్ఆన్- అది మార్గం మరచిన మానవాళికి మార్గదర్శిని. కరుణ జాలి, దయ, ఆప్యాయత, అనురాగం, మమకారం మరచిన జాతికి అది కారుణ్యప్రదాయిని. ఆర్థిక, ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక రుగ్మతలతో అల్లాడిపోతున్న మానవాళికి అది దివ్య ఔషధీ, నిత్యం నేరాలతో, ఘోరాలతో, అఘాయిత్యాలతో, అస్పృశ్యతా భావాలతో కుతకుతలాడుతున్న బడుగు బలహీన ప్రజలకు అది శుభవార్త. అది ఎవరూ ఆర్పడం సాధ్యం కానీ అల్లాహ్ జ్యోతి.

మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. ఇది మీ హృదయ రుగ్మతలకు నివారిణి. దీన్ని స్వీకరించేవారికి ఇది మార్గదర్శిని, కారుణ్యప్రదాయిని. ప్రవక్తా! వారికిలా తెలియజెయ్యి: "ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీకోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెడ్తున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది. *(దివ్య ఖుర్ఆన్ 10: 57-58)*

ఈ యదార్థాన్ని గ్రహించని ప్రజలు నాడే కాదు నేడు సయితం - ఈ మహద్గ్రంథం యెడల అనుచితంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. ఈ నేరస్తుల కుట్రలను అల్లాహ్ తిప్పి కొడుతూనే ఉంటాడు. "చూడండి ఇప్పుడు అల్లాహ్ దాన్ని ఎలా విచ్ఛిన్నం చేస్తాడో. ఆయన దుర్మార్గుల పనిని నెరవేర నీయడు. దురాత్ములకు ఎంత వెగటు కలిగినా అల్లాహ్ తన నిదర్శనాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించి తీరుతాడు."

*(దివ్య ఖుర్ఆన్ 10: 80-82)*

ఎవరికి ఎంత వెగటు కలిగినా, ఎవరికీ ఎంత నచ్చకపోయినా, ఎవరు ఎంతగా అసహ్యించుకున్నా అల్లాహ్ తన జ్యోతిని వెలిగించే ఉంచుతాడు."వారు తమ నోటితో అల్లాహ్ జ్యోతిని (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా అల్లాహ్ మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు.

అది సవ్యమైన బాట వైపునకు మానవాళిని నడిపిస్తుంది. అది చూపే రాచబాట ప్రారంభం ఇహంలో ఉంటె, దాని గమ్యం స్వర్గం. అది పండితులు మొదలు పామరుల వరకు, రాజులు మొదలు సామాన్య ప్రజల వరకు, ధర్మాత్ములు మొదలు దుర్మా ర్గుల వరకు - అందరికి స్పష్టంగా అర్థమయ్యేలా సత్యాసత్యా లను, ధర్మాధర్మాలను, న్యాయాన్యాయాలను విశదపర్చే అద్భుత దైవ శాస్త్రం. కానరాక, శాంతి లభించక గాఢాంధకారాల్లో కొట్టుమిట్టాడుతున్న జనావళికి వెలుగు వెన్నెల స్నానాలు చేయించడానికి అవతరించిన తేజోన్మయ గ్రంథం అది. అసత్య ధ్వజవాహకులు, అధర్మ అధినాయకులు, అల్లరి మూకల నేతలు దానికి మసి పూయడానికి, కళంకితం చేయడానికి నిత్యం శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తూనే ఉంటారు. అంత మాత్రాన దాని ప్రభ తగ్గిపోతుందనుకోవడం ఒట్టి భ్రమ.

సముద్రానికి చమురు పూస్తే జిడ్డు పడుతుందా?

హిమనగానికి బొగ్గుపూస్తే నల్లబడుతుందా?

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "సత్యధర్మం బహుదైవారాధకు లకు ఏమాత్రం నచ్చకపోయినాసరే ఇది యావత్తు జీవన వ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ అల్లాహ్ తన (అంతిమ) ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు." *(32-33)*

ఆకాశ నక్షత్రాలు రాలి పోయినా ఆకాశ గ్రంథమైన ఖుర్ఆన్ తన అమృత చినుకుల్ని కురిపిస్తూనే ఉంటుంది. దాన్ని తన ధన, మాన, ప్రాణాల కన్నా భావించే ప్రజల శరీరం చివికి మట్టిలో కలిసిపోతుంది, గుర్తుపట్టలేనంతగా మట్టిగా మారి పోతుంది. కానీ అది బోధించిన జీవిత సత్యాలు, ఆశయాలు జీవించే వుంటాయి.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "నిశ్చయంగా ఈ హితోపదేశ గ్రంథాన్ని మేమే అవతరింపజేశాం. దాన్ని పరిరక్షించేవాళ్ళం కూడా మేమే. *(దివ్య ఖుర్ఆన్- అల్ హిజ్ర్:09)*

ఇదొక శక్తిమంతమైన గ్రంథం. దుష్టశక్తులు దానిపై ముందు నుంచీ దాడి చేయలేవు; వెనుక నుంచీ దాడి చేయలేవు. ఇది మహా వివేకవంతుడు, స్వతహాగా ప్రశంసనీయుడయిన అల్లాహ్ నుండి అవతరించిన (అద్భుత)వాణి. *(హామీమ్: 42)*

వారికి చెప్పు: "యావత్తు మానవులు, జిన్నులు ఏకమయి కఠోరంగా పరిశ్రమించినా, పరస్పరం సహకరించుకున్నా, ఖుర్ఆన్‌లాంటి గ్రంథాన్ని ఎన్నటికీ రచించలేరు." *(88)*

పవిత్ర ఖుర్ఆన్ మానవాళి పాలిట ఓ మహాదానుగ్రహం.

ప్రపంచంలోని మరే అనుగ్రహం దీనికి సరితూగదు. ఈ గ్రంథంలో భూత, భవిష్య, వర్తమానానికి సంబంధించిన సమాచారమూ ఉంది. సృష్టి, సృష్టి నిర్మాణం, సూర్యచంద్రనక్షత్ర భ్రమణ వివరాలూ ఉన్నాయి. గత జాతుల, ప్రవక్తల ఆదర్శాలూ ఉన్నాయి. విశ్వాసుల మధుర ఫలం స్వర్గం, అవిశ్వాసుల దుష్ఫలం నరక ప్రస్తావనలూ ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి ఇహపరాల సాఫల్యాలు, సభ్యతా సంస్కారాలు, గౌరవోన్నతులు, నీతినడవడికలు-అన్నీ ఈ ఉద్గ్రంథంతోనే ముడిపడి ఉన్నాయి. రాజాధిరాజు అయిన అల్లాహ్ ఈ గ్రంథరాజం గురించి ఇలా సెలవిస్తున్నాడు: "ఓ ప్రవక్తా! మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. అందులో ప్రతీ విషయం విశదీకరించబడింది. విధేయత చూపేవారికి ఇది మార్గదర్శకం, కారుణ్యం, శుభవార్త". *(నహ్ల్ : 89)*

పవిత్ర ఖుర్ఆన్ ఓ మహాసాగరం. ఈ గ్రంథాన్ని విజ్ఞులు, వివేచనాపరులు, పండితులు శోధించినకొద్దీ వారి తృష్ణ పెరుగుతూనే ఉంటుంది దాని లోతుల్లోకి పోయిన కొద్దీ ముత్యాలు, పగడాలు, మణిమాణిక్యాలు దొరుకుతూనే ఉంటాయి. అదో అంతం కాని జ్ఞానఖని. విజ్ఞానగని. ఈ గ్రంథంలో అల్లాహ్ పవిత్ర నామాలు, గుణగణాలతోపాటు, అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన ప్రవక్తలను, ఆయన గ్రంథాలను విశ్వసించండి అన్న పిలుపు కూడా ఉంది.

"తన ప్రభువు తరపున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించాడు. దాన్ని విశ్వాసులు కూడా సత్యమని నమ్మారు. వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను విశ్వసించారు.'మేము ఆయన పంపిన ప్రవక్తల మధ్య ఎలాంటి వివక్ష, భేదభావాన్ని పాటించము' అనంటారు. అలాగే "మేము విన్నాము విధేయులయ్యాము మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే" (అని దీనాతిదీనంగా వేడుకుంటారు.) (బఖరా:285)

విజ్ఞానం శృతి మించి వినాశనం సృష్టిస్తున్న నేటి తరుణంలో, మతం మతి తప్పి మారణ హోమం రగలిస్తున్న నేటి యుగంలో, అస్పృశ్యత, అంటరానితనం, నిమ్నోన్నతా భావం అపశృతులు పలికిస్తున్న నేటి ఆధునికంలో, ఉన్మాదం, ఉగ్రవాదం వెర్రి తలలు వేస్తున్న నేటి కలికాలంలో, మారణాస్త్ర నిర్మూ లనమే సమస్త మానవ వికాసమనీ, అఖిల మానవాభ్యుదయమే విశ్వాస దళ ధ్యేయమని వక్కాణిస్తుంది ఖుర్ఆన్. అందరినీ ప్రేమించడమే ఇస్లాం అభిమతమని, అదే సుమా ఎప్పటికీ దైవసమ్మతం అని ఉద్ఘాటిస్తుంది. అందుకు భక్తి మార్గమే అన్ని విధాల శ్రేయస్కరమని నొక్కి చెబు తుంది. పుట్టుకరీత్యా ఎవరూ అల్పులు కారని, అందరూ దైవ దాసులేనని, దైవభీతి పరులే దైవానికి ప్రియులని హితవు పలుకుతుంది. "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ నుంచి సృజించాము. తర్వాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవానికి అర్హుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వ జ్ఞానం కలవాడు. సకల విషయాలు తెలిసినవాడు". *(అల్‌హుజురాత్: 13)*

పవిత్ర ఖుర్ఆన్ ఒక అద్భుత కళాఖండం. అది తన పఠితులను ఉర్రూతలూగించడమే కాక, సృష్టి, సృష్టి రహస్యాల గురించి, తన ఆయతుల గురించి ఆలోచించమని పురిగొల్పుతుంది. వారిలో జిజ్ఞాసను పెంచుతుంది.

ఓ ప్రవక్తా! వారికి చెప్పు: "ఆకాశాలలో, భూమిలో ఏ వస్తువులైతే ఉన్నాయో వాటిని కాస్త (నిశిత దృష్టితో) చూడండి".
*(యూనుస్:101)*

మరో చోట ఇలా ఉంది: "ఏమిటి, వారు ఖుర్ ఆన్ గురించి లోతుగా ఆలోచించరా? లేక వారి హృదయాలపై తాళాలు పడి ఉన్నాయా?" *(ముహమ్మద్ : 24)*

ప్రజలారా! ఇది మనందరి కోసం చేయబడుతున్న హితవు - మనం ఆల్లాహ్ యెడల తఖ్వా కలిగి జీవించాలి. తఖ్వా ద్వారానే ముక్తి, మోక్షాలు సాధ్యం. మనం కలిసి ఉంటేనే బలం. చెల్లాచెదురుగా ఉన్న మనల్ని ఏకతాటి మీద కట్టి ఉంచగలిగే, కట్టడి చేయగలిగే సత్తా అల్లాహ్ త్రాడు అని చెప్పబడిన ఖుర్ఆన్ గ్రంథానికి మాత్రమే ఉంది. మనం అల్లాహ్ త్రాడును గట్టి పట్టుకోవాలి. విభేదాల్లో పడి విడి పోకూడదు. అన్యదా మన శక్తి మొత్తం బూడిదలో పోసిన పన్నీరయిపోతుంది. తెలుసుకొండి! వాక్యాల్లోకెల్లా సత్య వాక్కు అల్లాహ్ వాక్కయిన ఖురాన్. ఆదర్శాల్లోకెల్లా గొప్ప ఆదర్శం మహనీయ ముహమ్మద్ (స) వారి ఆదర్శం. మనం తౌహీద్ (ఖురాన్) వీడితే ఖచ్చితంగా షిర్క్ అడుసు తొక్కుతాము. అడుసు తొక్కనేల కాలు కడగనేల. అడుసు అంటే బురద - బురదను ముట్టుకుంటే అంటుకుంటుంది. ఈ విషయం తెలిసీ దాన్ని తొక్కటం ఎందుకు, తర్వాత అంటుకుంది అని బాధపడి కడుక్కోవటం ఎందుకు చేతులు కాలాక ఆకులు పట్టుకొంటే లాభం ఉండదు. మనం సున్నత్ (ప్రవక్త (స) వారి ఆదర్శాలను తుంగలో తొక్కేసినట్లయితే తర్వాత మనకు పట్టె దుర్గతికి ఏ ఒక్కరూ తొంగి కూడా చూడరు. ఫలితంగా బిద్అత్ భయంకర ఊబిలో లోతుగా దిగబడి పోతాము, ఎగబడి ఎదిగే అన్ని అవకాశాల్ని కోల్పోతాము. ✤






# ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు

## పర్యావరణానికి పనికొస్తాయా

- ఉమైర్

2011లో సూసాన్ ఫింకెల్ రాసిన "ప్లాస్టిక్: ఎ టాక్సిక్ లవ్ స్టోరీ"లో ఆసక్తికరమైన విషయాలు తెలియజేసింది. మనం ప్రతిరోజూ ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులను లెక్కించింది. ప్రతి రోజు తాను దాదాపు 196 ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్నట్లు చెప్పింది. ప్లాస్టిక్ కాని వస్తువులు కూడా ప్రతిరోజు వాడుతుంటాం. వాటి సంఖ్య కేవలం 102 మాత్రమే అని చెప్పింది. సగటు మనిషి వాడే వస్తువుల్లో కనీసం అరవై శాతం ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్‌తో సంబంధించినవే. ఎలక్ట్రిక్ స్విచ్చులు, బక్కెట్లు, టూత్ బ్రష్షులు ఇలాంటివెన్నో. ప్రపంచంలో భారీ పరిమాణంలో ప్లాస్టిక్ తయారవుతోంది. ప్రపంచంలోని చమురు ఉత్పత్తిలో 8 శాతం ప్లాస్టిక్ కోసమే ఉపయోగపడుతోంది. ఇందులో 50 శాతం ప్లాస్టిక్ తయారు చేసే ముడిపదార్థంగా ఉపయోగపడుతుంది. మిగిలిన 50 శాతం ప్లాస్టిక్ తయారు చేయడానికి శక్తి వనరుగా ఉపయోగపడుతుంది.

లియో బేక్ ల్యాండ్, 1907లో ఒక కొత్త విషయాన్ని కనిపెట్టాడు. అప్పుడాయన వయసు 43 సంవత్సరాలు. ఫినాల్, ఫార్మల్ డిహైడ్‌లతో ఆయన ప్రయోగాలు చేస్తున్నప్పుడు ఒక కొత్త పదార్థం తయారవ్వడం చూశాడు. ఆ రకంగా మొదటి సారి సింథటిక్ రెసిన్ తయారైంది. అదే ప్రపంచంలో వాణిజ్యపరంగా మొదటి సారి వాడకంలోకి వచ్చిన ప్లాస్టిక్. దీన్ని కనిపెట్టిన బేక్ ల్యాండ్ పేరుతోనే దీన్ని బేక్ లైట్ అని పిలిచారు.

ప్లాస్టిక్ తయారు చేయడం ప్రారంభించిన తర్వాత మనిషి ప్రకృతి విధించిన పరిమితులను అధిగమించాడు. వివిధ వస్తువులు తయారు చేసుకోడానికి మనకు ప్రకృతి అనేక పదార్థాలను ఇచ్చింది. లోహాలు, కలప, ఏనుగు దంతాలు, కొమ్ములు.. ఇలా ఎన్నో ఉన్నాయి. కాని మనుషులు తమ స్వంత మేధస్సుతో కొత్త పదార్థాలు తయారు చేసుకోగలిగారు. ప్లాస్టిక్ మనిషి తయారు చేసుకున్న కొత్త పదార్థం. ఒప్పుకోవలసిన వాస్తవం ఏమంటే ప్లాస్టిక్ వల్ల చాలా సౌలభ్యాలున్నాయి. ఇది చవుకైనది. చాలా తేలిగ్గా ఏ ఆకారంలో కావాలంటే ఆ ఆకారంలో తయారు చేయవచ్చు. ఎలక్ట్రిసిటీకి నిరోధకంగా పనిచేస్తుంది.

ప్లాస్టిక్ ఒక మ్యాజిక పదార్థంలా కనబడింది. కాని దీనివల్ల నష్టాలు తర్వాత తెలిసి వచ్చాయి. ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలను ప్రకృతి తిరిగి రీసైకిల్ చేసి ఇస్తుంది. కాని ప్లాస్టిక్ అలాంటిది కాదు. ప్లాస్టిక్ డికంపోజ్ అవ్వాలంటే చాలా కాలం పడుతుంది.

ప్లాస్టిక్ డికంపోజ్ అవ్వాలంటే దాదాపు 1000 సంవత్సరాల కాలం పడుతుంది. నీళ్ళ బాటిళ్ళు డీకంపోజ్ అవ్వాలంటే 450 సంవత్స రాల కాలం పడుతుంది. మనం ప్రతిరోజు వాడే పాలిథిన్ సంచులు డికంపోజ్ అవ్వాలంటే 1000 సంవత్సరాల వరకు పడుతుంది. ప్లాస్టిక్ కు సంబంధించి మరో సమస్య మైక్రో ప్లాస్టిక్కులు. ఈ ప్లాస్టిక్ నీళ్ళలో అల్ట్రావయొలెట్ కిరణాలకు గురి అయితే చిన్న చిన్న కణాలుగా విచ్ఛిన్నమవుతాయి. ఆ తర్వాత అవి సూక్ష్మజీవుల్లోకి చేరుకుంటాయి. అలా అవి ఆహార వలయంలోకి ప్రవేశిస్తాయి. అందువల్లనే నేడు ప్రపంచంలో మనిషి ప్రతివారం కనీసం 5 గ్రాముల ప్లాస్టిక్ తింటున్నాడు.

భారతదేశంలోను ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య తీవ్రంగా మారుతోంది. దేశంలో ప్రతిరోజు 26 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు తయారవు తున్నయి. నాలుగు మెట్రోనగరాల్లో ప్రతిరోజు ప్లాస్టిక్ వ్యర్థాలు అనేక వేల టన్నులు తయారవుతున్నాయి. దేశంలో తయారయ్యే ప్లాస్టిక్ వ్యర్థాల్లో 40 శాతం నాలుగు మెట్రో నగరాల్లోనే తయారవు తున్నాయి. సగటున ప్రతి భారతీయడు ఏడాదికి 11 కి.గ్రా. ప్లాస్టిక్ వాడుతున్నాడు. అమరికాతో పోల్చితే ఇది తక్కువే. అమెరికాలో ఏడాదికి సగటున 109కిలోలు వాడుతున్నారు.

గమనించవలసిన మరో విషయమేమంటే, ప్రతిరోజు భారత దేశంలో 10వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించకుండా అలా వదిలేయడం జరుగుతోంది. ఇలా వదిలేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు చివరకు సముద్రాల్లో చేరుతాయి. లేదా గుట్టలు గుట్టలుగా పేరుకుపోతాయి. ఎల్లెన్ మాక్ ఆర్థర్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం 2050 నాటికి ప్రపంచంలోని సముద్రాల్లో ఉన్న చేపల బరువు కన్నా ప్లాస్టిక్ బరువు ఎక్కువ ఉంటుంది.

నిజం చెప్పాలంటే మనం ఇప్పుడొక నలురోడ్ల కూడలిలో ఉన్నాం.

మన ప్రగతి వికాసాల్లో ప్లాస్టిక్ నిస్సందేహంగా కీలకపాత్ర పోషిం చింది. కాని మరోవైపు భయానకమైన పర్యావరణ సమస్యకు కారణమవుతోంది. ప్రభుత్వం ఇటీవల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంటే సంచులు, కప్పులు, పళ్ళాలు, చిన్న చిన్న సీసాల వంటివి నిషేధించింది. ప్రజలు కూడా ఇలాంటి చర్యలకు మద్దతిస్తు న్నారు.

ప్లాస్టిక్‌పై నిషేధం అనేది ఇప్పుడు చాలా అవసరం. అయితే తగిన ప్రత్యామ్నయాన్ని కూడా వెదకవలసి ఉంది. ప్లాస్టిక్ ఎక్కడబడితే అక్కడ కనబడడం వల్ల దాన్ని తొలగించాలని భావి స్తున్నాం, కాని దానికి ప్రత్యామ్నయం ఏమిటన్నది ఆలోచించడం లేదు.

2018లో డేనిష్ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఒక నివేదిక ప్రచురించింది. ప్లాస్లిక్ ప్రత్యామ్నయాలుగా భావిస్తున్నవి కూడా పర్యావరణానికి అనుకూలమైనవి కాదని తేల్చి చెప్పింది. కాగితం సంచులు, గుడ్డ సంచులు కూడా పర్యావరణానికి చేసే నష్టం ఉందని చెప్పింది. వీటి తయారీకి కలప, నీరు వాడవలసి ఉంటుంది. వాయుకాలుష్యం కూడా తప్పదు. వీటి తయారీలో ఎసిడిఫికేషన్, రేడియేషన్, మినరలైజేషన్ వంటివి తప్పవు. అడవు లను నరికి కలప సేకరించక తప్పదు. అయితే పేపరు బ్యాగును 43 సార్లు రీ యూజ్ చేయవచ్చు. గుడ్డ సంచిని 7,100 సార్లు రీయూజ్ చేయవచ్చు.


ఈ ప్రత్యామ్నయాలపై పరిశోధన జరగాలి. భవిష్యత్తులో కాగితం సంచుల వల్ల పర్యావరణ సమస్యలు, గుడ్డ సంచుల వల్ల పర్యా వరణ సమస్యలపై చర్చ జరిగే పరిస్థితి రాకూడదు. వీటి తయారీకి అడవులు అంతరించిపోతున్నాయన్న ఆందోళనలు వినిపించ కూడదు. గుడ్డసంచుల తయారీకి నీటి వనరుల్లో రసాయనాలు కలిసి కలుషితమవుతున్నాయన్న ఆందోళనలు కూడా వినిపించ కూడదు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయం కోసం అన్వేషించాలి. ఈ ప్రత్యామ్నాయాల అన్వేషణలో ఉప యోగపడేది సాంకేతిక పరిజ్ఞానం.

2016లో జపాన్ శాస్త్రవేత్తలు ప్లాస్టిక్‌ను బ్రేక్ డౌన్ చేసే బాక్టీరి యాను కనిపెట్టారు. ఈ బ్యాక్టిరియాలోని ఒక ఎంజైమ్ ప్లాస్టిక్ ను తినేయగలదు. 2018లో అమెరికాలోని శాస్త్రవేత్తలు ఈ ఎంజైమ్ ను కృత్రిమంగా తయారు చేయగలిగారు. అంటే వందల సంవత్సరాలు డికంపోజ్ కాలం పట్టే ప్లాస్టిక్‌ను కేవలం కొన్ని వారాల్లో డికంపోజ్ చేసే వైపు పరిశోధనలు సాగుతున్నాయి. అలాగే ప్లాస్టిక్ రీసైక్లింగ్ విషయంలోను రోబోట్లను వాడడంద్వారా ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌తో ఇటుకలు, ఫర్నిచర్, గోడలు, రోడ్ల నిర్మాణానికి ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతేకాదు, ప్లాస్టిక్‌ను ఇంధనంగా లేదా ప్లాస్టిక్ ఆయిల్‌గా వాడే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

ప్లాస్టిక్ ను నిషేధించడం వల్ల పారిశ్రామిక రంగంపై పడే ప్రభావం కూడా ఉంది. కాబట్టి ప్లాస్టిక్‌కు తగిన ప్రత్యామ్నయం కనిపెట్టడం, ప్లాస్టిక్ రీసైకిలింగ్‌ను మరింత ప్రయోజనకరంగా మార్చడం, ప్లాస్టిక్ డికంపోజింగ్‌లో ప్రగతి సాధించడం వంటి విషయాలపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. ■

కథ

**తస్నీమ్ జహాన్ ఖాన్**



# బంగారు పంట

పెళ్ళి సందడితో జాబిర్ ఇల్లు కళకళలాడుతుంది. పెళ్ళి వేడుకకు ఇంకా రెండు రోజులే మిగిలి ఉన్నాయి. పెళ్ళి కూతురితోపాటు అత్తారింటికి పంపాల్సిన వస్తువులు ప్యాక్ చేస్తుంది జాబిర్ భార్య ఫౌజియా. కొన్ని వస్తువులను చూసుకుని తెగ మురిసిపోతుంది. అంతలోనే కన్నీటి పర్యంతమవుతుంది. ఆ నగలు, వస్త్రాల్లో తన కూతురు ఫిజా ఎంత అందంగా ఉండబోతుందో తలుచుకుంటుంది. ప్రతీ ఆడపిల్ల తల్లిదండ్రులు ఈ అనుభూతిని తప్పక రుచి చూడాల్సిందే కదా!

ఫిజా తన తల్లి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయింది. అమ్మా! ఏంటి వింతగా ప్రవర్తిస్తున్నావ్? అని అడిగింది ఫౌజియాని.

ఫౌజియా తన కూతురిని దగ్గరగా తీసుకుని హత్తుకుంది. ఏమైందమ్మా... అంత ఎమోషనల్ అవుతున్నావ్? అడిగింది ఫిజా. ఏం లేదు లేవే అనింది ఫౌజియా. అమ్మా! నీకు ఈ పెళ్ళి ఇష్టం లేదా? అడిగింది ఫిజా. ఎందుకు ఇష్టంలేదు? నా సమ్మతం ముందే తెలియజెప్పాను కదా! అలా ఎందుకు అడిగావ్ ప్రశ్నించింది ఫౌజియా.

నాకు పెళ్ళి కుదిరినప్పటి నుంచి నువ్వు చాలా డల్‌గా ఉంటున్నావ్. రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోవట్లేదు. సరిగ్గా తిండి తినట్లేదు. ఎప్పుడూ దీర్ఘాలోచనల్లో మునిగి ఉంటున్నావ్. నీ వాలకం చూస్తుంటే నీకు ఈ పెళ్ళి ఇష్టం లేదేమో అన్పిస్తుంది అన్నది ఫిజా.

నోటికి ఏదొస్తే అది అనేయడమేనా? ముందూ వెనుక ఆలోచించి మాట్లాడాలి కదా.. అని అసహనాన్ని వ్యక్తం చేసింది ఫౌజియా. మరి నువ్వు ఎందుకలా ఉంటున్నావ్? అడిగింది ఫిజా. మౌనంగా తన పని తాను చేసుకునేందుకు పక్కకు జరిగింది ఫౌజియా. ఇంతలో ఫౌజియా కొడుకు ఫిరోజ్ వచ్చి, అక్కా! నీ పెళ్ళి అమ్మకు ఇష్టం లేదని ఎందుకు అనుకుంటున్నావ్? నీ మాటకు అమ్మ మనస్సు నొచ్చుకుంటుంది. నువ్వు ఇష్టపడ్డ వ్యక్తికి ఇచ్చి పెళ్ళి చేస్తున్నామంటే, నీ ఇష్టమే మా అందరి ఇష్టం అని తెలుసుకో అక్కా అన్నాడు ఫిరోజ్.

ఏమోరా... నాకు నా ఇష్టయిష్టాలకంటే మీ అందరి సమ్మతి ముఖ్యం. అమ్మ ఏదో టెన్షన్ పడుతుందని ఆరా తీద్దామని అలా అడిగానులే అన్నది ఫిజా.

ఆడపిల్ల అన్నాక ఏదో ఒకరోజు పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళాల్సిందే కదా అమ్మ. నువ్వు ఎందుకు అంతలా కలత చెందుతున్నావ్ అని అడిగాడు ఫిరోజ్.

నువ్వు ఇష్టపడి పెళ్ళి చేసుకుంటున్నావా లేక మేము కుదిర్చిన సంబంధం చేసుకుంటున్నావా అనే విషయం కాదు సమస్య. పెళ్ళి చేసుకున్న తర్వాత ఆ బంధాన్ని ఎంత వరకు సార్థకం చేసుకుంటామా అనేది సమస్య అన్నది ఫౌజియా.

ఫిజా, ఫిరోజ్ ఇద్దరూ ఫౌజియా వైపు అయోమయంగా చూడ సాగారు. ఫిజా నీకు అందముంది, చదువుంది, మా నుండి వచ్చే ఆస్తి, ఐశ్వర్యం ఉంది. కానీ వాటన్నింటికంటే ముఖ్యమైనది మాత్రం లేదు అన్నది ఫౌజియా. అది బ్రెయినే కదా అంటూ ఆట పట్టించాడు ఫిరోజ్. నేను చెప్పేది మీరిద్దరూ శ్రద్ధగా వినాల్సిన అంశం. కాస్త సావధానంగా వినండి అన్నది ఫౌజియా.

ఫిజా నీ గురించి ఇలా చెప్తున్నానని నువ్వు నన్ను అపార్థం చేసుకోకు. కానీ ఈ విషయం గురించి నీతో తప్పక డిస్కస్

చేయాల్సిందే. లేకపోతే తర్వాత నష్టపోయేది నువ్వే అన్నది ఫౌజియా. ఎప్పుడూ లేనిది అమ్మ ఇలా అంటుందేంటి అనుకున్నారు అక్కాతమ్ముళ్ళు.

ఫిజా నీకు  నోటిదురుసుతనం ఎక్కువ. వెనుకా ముందూ ఆలోచించకుండా, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా నోటికి ఏదొస్తే అది అనేస్తావు. నువ్వు మా కూతురివి. నీ మాటలు మమ్మల్ని బాధించవు. నీ నైజం గురించి మేమంతా అర్థం చేసుకుని నీ మాటల్ని లైట్‌గా తీసుకుంటాం. కాని పెళ్ళయ్యాక పరిస్థితి వేరు. కొత్త మనుషుల మధ్య కోటి ఆశలతో అత్తారింట్లో అడుగుపెట్టే నీపైనే అందరి చూపులు ఉంటాయి. నీ ప్రవర్తన, నీ మాటలపైనే నీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అన్నది ఫౌజియా.

అంటే నీ లాగా అత్తారింటి వాళ్ళు ఎన్ని సూటిపోటి మాటలు చెప్పినా గంగిరెద్దులాగా తలాడిస్తూ నోటికి తాళం వేసుకుని ఉండమంటావా? అని పట్టుమని పేలింది ఫిజా.

నేను చెప్పేది ఇంకా పూర్తి కాలేదు ఫిజా... అన్నది ఫౌజియా. నేను నీలా మాటలు పడేరకం కాదు. మాటకు మాట బదులివ్వాల్సిందేనమ్మా. వాళ్ళు ఒక్క మాట అంటే నేను పది మాటలు అంటాను. మళ్ళీ ఎవరూ నా జోలికి రారు. నా పిల్లల్ని కూడా నాలాగే గట్టిగా మాట్లాడేవారిగానే పెంచుతాను ఆక్రోశంతో చెప్పింది ఫిజా.

నీ గడుసుతనంతో నీ జీవితం పాడు చేసుకుంటావేమో అనే టెన్షన్ పట్టుకుంది నాకు... అన్నది ఫౌజియా. ఫిజా, ఫిరోజ్ ఇద్దరూ వినండి పెళ్ళి జరగటం పెద్ద అచీవ్‌మెంట్‌కాదు. పెళ్ళయిన తర్వాత దాన్ని నూరేళ్ళ బంగారు పంటగా మార్చుకోవటం పెద్ద అచీవ్‌మెంట్. దీనికోసం మనకు సహాయపడే ముఖ్యమైన లక్షణాలు మృదు సంభాషణ, క్షమాగుణం. ఇవి లేకుండా వివాహ బంధం సాఫీగా సాగదు.

ఫిజా పెళ్ళై అత్తారింటికి వెళ్ళినా, ఫిరోజ్‌కు పెళ్ళయి వాడి భార్య మనింటికి వచ్చినా కొత్తవాళ్ళ మధ్య స్థిరపడటానికి చాలా టైమ్ పడుతుంది. బంధువులతో వివాహం జరిగినా, ఎన్నో సంవత్సరాల నుండి పరిచయమున్న కుటుంబంతో వివాహ బంధం ఏర్పరచుకున్నా కూడా పెళ్ళయిన తర్వాత అందరి ప్రవర్తనలు, ధోరణులు కొత్తగా వెలుగులోకి వస్తాయి. మనం ఎంతో మంచి వాళ్ళు, అర్థం చేసుకున్న వారుగా భావించే వాళ్ళు చెడ్డవారిగా మనం గుర్తించవచ్చు లేక మనం చెడ్డవారుగా భావిస్తున్నవారు మంచివాళ్ళుగా మనం గుర్తించవచ్చు. ప్రేమ వివాహానికి, పెద్దలు కుదిర్చిన వివాహానికి పెద్ద తేడా ఏమీ ఉండదు. ఆ వివాహాన్ని సార్థకం చేసుకోవడం మాత్రం భార్యాభర్తలిద్దరిపైనే  ఆధారపడి ఉంటుంది.

భార్యాభర్తల్లో గొడవలు ప్రారంభమయ్యేది వారి నోటిదురుసుతనంతోనే! నోటికి ఏది తోచితే అది మాట్లాడి ఎదుటివారి మనస్సును నొప్పించటం వల్లే ముందు తగాదలు ఆరంభమవుతాయి. చినికి  చినికి గాలివానగా మారి పెళ్ళయిన కొత్తలోనే విడాకులకు దారి తీస్తున్నాయి. ఎదుటివారు కయ్యానికి కాలుదువ్వినా, నోటి దురుసుతనం ప్రదర్శించినా మీరు మాత్రం మీ మంచితనంతో వారి మనసును, ప్రవర్తనను మంచివైపునకు మళ్ళించే ప్రయత్నం చెయ్యాలి. మీలోని మంచితనాన్ని వారు గుర్తించి తమను తాము మంచిగా తీర్చిదిద్దుకునేలా మీ వ్యక్తిత్వం ఉండాలి అన్నది ఫౌజియా.

వారు మమ్మల్ని హర్ట్ చేసినా కూడా ఊరుకోవాలా? వారికి కూడా మన బాధ తెలిసివచ్చేలా జవాబు ఇస్తేనే కదా అమ్మ వారికి తెలిసి వచ్చేది... అన్నది ఫిజా.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో దీనికి చక్కని పరిష్కారం చూపబడింది:

‘ఓ ప్రవక్తా! చెడును ఉత్తమమైన పద్ధతి ద్వారా నివారించు. ఏ విషయాలను వారు నిన్ను గురించి కల్పిస్తున్నారో అవి మాకు బాగా తెలుసు. ఇలా ప్రార్థించు, “ప్రభూ! షైతానుల ప్రేరణల నుండి నేను నిన్ను శరణు వేడుకుంటున్నాను. నా ప్రభూ! అవి నా వద్దకు అసలు రాకుండేటట్టు నిన్ను శరణు వేడుకుంటున్నాను”.

సంసారం అనేది రణరంగం కాదు. వీళ్ళు ఒకటి చెప్తే మీరు పది వడ్డించడానికి. ఒక రోజుతో ముగిసిపోయే, తెగిపోయే బంధాలు కావు. జీవితాంతం ఈ బంధాలు ఉంటాయి. సాధ్యమైనంత వరకూ మనం ఇంటి వాతావరణాన్ని  ప్రశాంతంగా

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన

సహజీవన భావనల సాపురాయి
గీటురాయి
వారపత్రిక

ఉండేలా చూసుకోవాలి. ఎదుటి వారు మనలోని మృదుత్వాన్ని, మంచితనాన్ని గుర్తించేలా సమయం వారికి మనం ఇవ్వాలి.

అత్తారంటి సమస్యలు అనేవి ప్రతి ఆడపిల్ల ఎదుర్కొనేదే. ఎవరికీ నెత్తికెక్కించుకుని తిరిగేవారు దొరకరు. అలా దొరికే అదృష్ట వంతులు చాలా తక్కువే ఉంటారు. ఏదో ఒక రూపంలో స్త్రీ అత్తారింటి బాధలు జీవితాంతం భరిస్తూనే ఉంటుంది. ఇది అర్థం చేసుకుంటే చాలు. చిన్న చిన్న విషయాలను, కోపతాపా లను భూతద్ధంలో పెట్టి చూసి రాద్ధాంతం చెయ్యకూడదు.

మీ నోటి దురుసుతనం, గడుసుతనంతో మీ జీవిత భాగస్వామిని ఎన్నడూ బాధపెట్టకూడదు. నోటి దురుసుతనం ఉన్నవారిని ఎవ్వరూ ఇష్టపడరు. నోటి దురుసుతనం, అతి కోపం ముందు ప్రేమ నిలువదు. మీకు లేని సహనం, ఓపిక ఎదుటివారు చూపించాలని కోరుకోవడం అత్యాశ, దుర్మార్గమే అవుతుంది.

ఏ విషయంలోనైనా ఎదుటివారు మన మీద ఫైర్ అవుతుంటే మనం కాస్త సహనం చూపాలి. మనం నిజంగానే తప్పు చేసి ఉంటే వెంటనే క్షమాపణ చెప్పాలి. మన తప్పు లేనప్పుడు ఓర్పుతో ఈ విషయాన్ని వివరించాలి.

గౌరవాన్ని ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవాలి. మీ భాగస్వామికి మీరిచ్చే గౌరవాన్ని, శ్రద్ధను బట్టే మీకు వారి నుండి గౌరవం, శ్రద్ధ లభిస్తాయి. అలాగే మీ అత్తారింటి వారికి మీరిచ్చే గౌరవాన్ని బట్టే మీ పుట్టింటి వారికీ ఎదుటివారి నుండి గౌరవం లభిస్తుంది.

మనిషి నైజం ఎలా ఉంటుందంటే, ఎప్పుడూ ఎదుటివారి తప్పే మనకు కన్పిస్తుంది. మనం చేస్తున్న తప్పులు, అరాచకాలు మనకు కనబడవు. దైవభీతితో ఎల్లప్పుడూ మనలో మనం ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి. మనిషి భార్యాభర్తల విషయంలో, అత్తారింటి విషయంలో, కోడలి విషయంలోనే దైవభీతిని విడిచి క్రూరంగా ప్రవర్తిస్తాడు. ఒకరిని ఏడిపిస్తే దాని భయంకర పరిణామం తప్పక చవిచూడాల్సిందేననే భయం భక్తీ మనిషి మరిచిపోతాడు. స్వార్థం, పొగరుతో కళ్ళు నెత్తికెక్కి ప్రవర్తిస్తాడు. మనం ఎవరినీ బాధపెట్టకూడదు. మనం ఎంత మంచితనాన్ని చూపించినా ఎదుటివారు మనల్ని అతిగా బాధిస్తున్నప్పుడే సముచితమైన విధంగా ప్రతిస్పందించాలి. చిన్నచిన్న విషయాలకే అతిగా రియాక్ట్ అయ్యి బంధాలను తెంచుకోకూడదు అని వివరించింది ఫౌజియా.

అమ్మ నువ్వు పాతిక సంవత్సరాలు మంచితనంతో, గౌరవంతో నీ అత్తారింటి వారిని సాకావు కదా... మరి నాయనమ్మ చనిపోయే వరకు నిన్ను తిడుతూనే ఉండేది కదా. నీకేం ఒరిగింది నీ మంచితనంతో? అడిగింది ఫిజా.

మన సత్కర్మలకు సత్ఫలితం మనుషుల నుండి కోరుకోవడం ఒక విశ్వాసి లక్షణం కాదు. విశ్వాసి ఎల్లప్పుడూ ప్రతిఫలాన్ని దైవం వద్దే కోరుకుంటాడు. మీ నాయనమ్మ తిట్టటాన్నే నువ్వు గుర్తించావు, కాని ఆమె నాపై చూపే ప్రేమాభిమానాలను నేను చూస్తాను. సంసారంలో ఎదురైన ప్రతీ ఒడిదుడుకుల్లోనూ ఆమె సీసం పోసిన గోడ వలె మాకు అండదండగా ఉండి మా భవిష్యత్తు బాగుండాలని తన సంపదనంతా మాకు ధారపోసింది. కలుపుకుపోతేనే జీవితం వికసిస్తుంది అన్నది ఫౌజియా.

సరే అమ్మ... నువ్వు చెప్పిన మాటలన్నింటినీ నేను గుర్తు పెట్టుకుని, దాని ప్రకారమే నా కాపురం చేసుకుంటాను అన్నది ఫిజా. నువ్వు పెళ్ళిచేసుకుని వెళ్ళిపోవటం కాదు, నాకోసం కూడా మంచి అమ్మాయిని చూసి పెట్టు అన్నాడు ఫిరోజ్. నేనెందుకు చూడాలి? నువ్వే చూసుకో అన్నది ఫిజా. టైమ్ వచ్చినప్పుడు అదే దొరుకుతుందిలే. ముందు వెళ్లి మీ మేనత్తను పిలుచుకు రా.. పెళ్లి పిలుపుతో వెళ్ళాలి అన్నది ఫౌజియా.

ఫిజా అమ్మను హత్తుకుని నా జీవితం బాగుండాలని నువ్వు పడే తపన, ఆరాటం అంతా నేను అర్థం చేసుకున్నాను. నువ్వేం దిగులు పడకు. పరిస్థితులను నేను ఓర్పు, సహనం, మౌనంతో ఎదుర్కొంటానులే అన్నది ఫిజా. నీకు ఇంకా ఏమైనా వస్తువులు అవసరమున్నా యేమో ఒక్కసారి చూసుకో. ఏదైనా మిస్ అయితే సాయంత్రం షాపింగ్ చేసి వద్దామని అన్నది ఫౌజియా. సరేగాని నేను చేసిన ఈ స్వీటు ఎలా ఉందో టేస్ట్ చెయ్యి అని గిన్నె అందించింది ఫిజా.


వామ్మో! ఏంటే ఇది. నీ మాటలతోనే అనుకున్నాను. వంటల తోనూ వాళ్ళను బెదిరించేస్తావేమో! అంటూ ఆట పట్టించింది ఫౌజియా. మరి ఈ ఫిజా వంట చేస్తుందంటే వాళ్ళు హడలి పోవాలి అంటూ తల్లీ కూతుళ్ళు నవ్వుకున్నారు.




'చరితార్థులు'-2



# మౌలానా ముహమ్మద్ బాఖర్ (1780-1857)




7

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల చర్యల మీద అక్షరాగ్నులు కురిపిస్తూ, తిరుగుబాటు వీరులను ప్రోత్సహించిన ఆనాటి పాత్రికేయులలో అగ్రగామిగా నిలచిన మౌలానా ముహమ్మద్ బాఖర్ 1780 లో ఢిల్లీలో జన్మించారు. తండ్రి ముహమ్మద్ అక్బర్. ప్రసిద్ధ ఢిల్లీ కాలేజీ విద్యార్థిగా ఉన్నత విద్యను పూర్తి చేసిన బాఖర్ కొంతకాలం ఉన్నత ఉద్యోగాలు చేసినా చిన్నతనంలోనే హృదయంలో నాటుకున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్య బీజాలు, స్వజనులు అనుభవిస్తున్న బానిసత్వం, ఆయనను ఆ ఉద్యోగాలలో నిలువనివ్వ లేదు. బ్రిటిష్ పాలకుల దుష్ట సంకల్పాన్నీ, అధికారుల దాష్టీకాలనూ ఎండగడ్తూ, ప్రజలకు వాస్తవాలు తెలిపి చైతన్యవంతుల్ని చేయాలన్న లక్ష్యంతో 1836లో ఢిల్లీ ఉర్దూ అఖ్బార్ వారపత్రికను ఆరంభించారు. మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్, మిర్జా గాలిబ్, హాఫీజ్ గులాం రసూల్, మిర్జా మొహమ్మద్ అలీ భక్ష్, మిర్జా హైదర్ షికో, మిర్జా జీవన్ భక్ష్, మిర్జా నూరుద్దీన్ లాంటి ప్రసిద్ధ కవులు-రచయితలు ఢిల్లీ ఉర్దూ అఖ్బార్ కు రాశారు. 1857 మే 10న ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ప్రారంభం కాగానే, మే 17 నుండి బాఖర్ పత్రిక సంగ్రామానికి సంబంధించిన అన్ని ప్రాంతాల విశేషాలను 'సంగ్రామ విశేషాలు' శీర్షికన ప్రచురించటం ఆరంభించింది. ఆంగ్లేయుల చర్యలను ప్రశ్నిస్తూ, పోరాటయోధుల చర్యలను సమర్థిస్తూ సుదీర్ఘ లేఖలను 'రాఖిం ఆసిం' అను కలం పేరుతో ఆయన ప్రకటించారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధులకు, నేతలకు, తిరుగుబాటును ప్రోత్సహించే ప్రజలకు, కవులు, రచయితలకు ఢిల్లీ ఉర్దూ అఖ్బార్ వేదిక అయ్యింది. పరాయి పాలకుల మీద విజయం సాధించాలంటే హిందూ-ముస్లిం ఐక్యత అత్యవసరమని ప్రకటిస్తూ, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు పురాణాలు, చరిత్రను ఉటంకిస్తూ, పురాణ పురుషులు, చారిత్రక వ్యక్తుల ధైర్యసాహసాలను ఉదహరిస్తూ ఢిల్లీ ఉర్దూ అఖ్బార్ వ్యాసాలు ప్రచురించింది. ఆయన రచనల వల్ల ఆగ్రహించిన ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు బాఖర్‌ను ఢిల్లీలోని తమ ప్రథమ శత్రువులలో ఒకరుగా పరిగణించారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857 సెప్టెంబరు 18న విఫలం కావటంతో డిసెంబరు 14న మౌలానా ముహమ్మద్ బాఖర్‌ను ఆంగ్లేయాధికారులు నిర్బంధించారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న పలువుర్ని నిరాయుధులను చేసి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన దుష్టచరిత్ర గల ఆంగ్లేయ సైన్యాధికారి మేజర్ హడ్సన్ విచారణ పేరుతో మౌలానా ముహమ్మద్ బాఖర్‌ను నిర్బంధించి, భయానక చిత్రహింసలకు గురిచేసి చివరకు 1857 డిసెంబరు 17న కాల్చి వేశాడు. ❑



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

7 అవును, ఇదేవిధంగా ప్రవక్తా, మేము ఈ అరబీ ఖుర్ఆన్‌ని నీకు వహీ ద్వారా పంపాము,[8] తద్వారా నీవు నగరాల కేంద్రం (మక్కా నగరం), దాని చుట్టుపట్లను నివసించేవారిని హెచ్చరించాలనీ[9] సమావేశ దినం పట్ల భయపెట్టాలనీను.[10] దాని రాకలో ఎటువంటి సందేహమూ లేదు. ఒక వర్గం స్వర్గంలోకి పోవలసి ఉంది, మరొక వర్గం నరకంలోకి.

8 అల్లాహ్ కోరుకున్నట్లయితే వీరినందరినీ ఒకే సముదాయంగా చేసివేసేవాడు, కాని ఆయన తాను కోరిన వారిని తన కారుణ్యంలో ప్రవేశింపజేస్తాడు. దుర్మార్గులకు ఏ ఒక్కడూ అండగా నిలువడూ సహాయమూ చేయడు.[11]

8. ప్రారంభంలో చెప్పిన విషయమే మరోసారి మరింత బలంగా పునరుక్తం చేయడం జరిగింది. 'అరబీ ఖుర్ఆన్' అని చెప్పి శ్రోతలను గుర్తు చేయడమూ జరిగింది, ఇదేదో పరాయి భాషలో లేదని, మీ స్వంత భాషలోనే ఉందని, మీరు స్వయంగానే నేరుగా దీన్ని అర్థం చేసుకోగలరని చెప్పడం జరిగింది. ఇంకా దీని విషయాలను పరిశీలించండని, ఈ పరిశుద్ధమయిన, నిష్కళంకమయిన, నిస్వార్థ మయిన మార్గదర్శకత్వం విశ్వప్రభువు తప్ప మరొకరెవరి తరఫునో కాదని తెలుపడం జరిగింది.

9. అంటే, వారిని ఏమరుపాటు నుండి జాగృతం చెయ్యి, వారిని హెచ్చరించు– ఆలోచనలు, నమ్మకాల ఏ మార్గవిహీ నతలకు, శీల స్వభావాల ఏ రుగ్మతలకు మీరు లోనయి ఉన్నారో, మీ వ్యక్తిగత, జాతీయ జీవితం ఏ భ్రష్ట సూత్రాల ఆధారంగా సాగుతోందో వాటి పరిణామ ఫలం వినాశంతప్ప మరేమీ కాదు అని.

10. అంటే, వారికి ఇదీ చెప్పివెయ్యి, ఈ దుష్పరిణామం, వినాశం కేవలం ప్రపంచం వరకే పరిమితం కాదు, మున్ముందు మరో దినం కూడా రానున్నది. అప్పుడు పరమ ప్రభువు అల్లాహ్ మానవులనందరినీ ప్రోగుచేసి వారి లెక్కలు చూస్తాడు. ప్రపంచంలో ఎవరయినా తన మార్గవిహీనతకు, దురాచరణకు దుష్పరిణామాన్ని తప్పించుకున్నా ఆనాడు తప్పించుకునే మార్గమేదీ లేదు. ఇక్కడా చెడిపోయి అక్కడా శాస్తి తప్పని వ్యక్తి మహా దౌర్భాగ్యుడు.

11. ఈ సందర్భంలో ఈ విషయం ఇక్కడ మూడు ఉద్దేశాలతో పేర్కొనబడింది:

మొదటిది, దీని ఉద్దేశం ప్రవక్త మహనీయులకు బోధన గరపడం, సాంత్వన కల్పించడం. ఇందులో ప్రవక్త(శ్రీ (స) కు బోధపరచిన విషయం ఏమిటంటే, మీరు మక్కా తిర స్కారుల అజ్ఞానం, మార్గ విహీనతల్నీ వాటిపైన వారి మంకుతనం, మొండిపట్టును చూసి ఇంతగా ఆవేదన చెంద వలసిన అవసరం లేదు. అల్లాహ్ అభీష్టం ఇదే, మానవు లకు ఎన్నుకునే, అనుసరించే స్వేచ్ఛనివ్వాలన్నదీ, ఆ తరు వాత మార్గబోధన కోరిన వారు సన్మార్గబోధన పొందాలన్నదీ, అపమార్గం కోరుకునేవారు ఎటుపోదలిస్తే, అటే పోనివ్వాలన్నదీ ఆయన అభిమతం. అల్లాహ్ కోరుకునే మర్మహేతువు ఇది కాకపోతే ప్రవక్తల్నీ, గ్రంథాలనూ పంపే అవసరమేముందనీ, ఆ మహోజ్వల వైభవోపేతునికి ఒక్క సృష్టి సంజ్ఞ సరిపోయేది, మానవులంతా ఆయన ఆజ్ఞాబద్ధు లయిపోయే వారు– నదులూ, కొండలు, చెట్లు, నేల, రాళ్ళు, మిగతా జీవరాసులన్నీ అయిపోయి నట్లు. (ఈ ఉద్దేశంతో ఇదే విషయం దివ్యఖుర్ఆన్‌లో ఇతర చోట్ల కూడా ప్రస్తావించబడింది. చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ఆమ్: పాద సూచికలు 23– 25, 71).

రెండవది, దీని సంబోధితులు చాలామంది మానసికంగా చిక్కులో పడి పోయినవారు. ఇటువంటి వారు ఆనాడూ ఉండేవారు నేడూ ఉన్నారు. వారు అనుకునేదేమిటంటే, అల్లాహ్ నిజంగానే మానవులకు సన్మార్గం చూపగోరితే, మానవుల్లో నేడు వ్యాపించిన, విశ్వాస పరమయిన, ఆచరణాపరమయిన విభేదాలు ఆయనకు ఇష్టం కాకపోతే, మానవులు, ఈమాన్, ఇస్లామ్ (విశ్వాసం, దైవవిధేయత) మార్గాన్ని అవలంబించడమే ఆయనకు ఇష్టమయినదయితే దానికి వహీ, దైవగ్రంథం, దైవదౌత్యం అన్నీ దేనికీ? ఆయన అందరినీ విశ్వాసులుగా విధేయులుగా పుట్టిస్తే ఈ పని సులభంగా నెరవేరేదిగా అనే చిక్కు ముడిలో వారు పడిపోయారు. ఈ చిక్కు ముడిలో అంతర్భాగమే ఈ వాదన కూడా. అల్లాహ్ అలా చేయలేదంటే దాని అర్థం మేము ఆచరిస్తున్న విభిన్న విధానాలు ఆయనకు ఇష్టమయినవే. మేము చేసేదంతా ఆయనకు ఇష్టమయినదే. అందువల్ల దీనికి అభ్యంతరాలు చెప్పే అధికారం ఎవ్వరికీ లేదు. (ఈ అపార్థాన్ని దూరం చేయడానికి కూడా ఈ విషయాన్ని ఖుర్ఆన్‌లో పలుచోట్ల వివరించడం జరిగింది. చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ ఆమ్: పాద సూచికలు 80, 110, 124, 125 సం.3, హూద్: పాదసూచి 116 సం.4, అన్ నహ్ల్ : పాద సూచికలు 10, 31, 32).

(11వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ أَحَادِيثِ الْأَنْبِيَاءِ

## 1. దైవప్రవక్తల (హదీసుల) ప్రకరణం

### న్యాయానికి నికషోపలం

**135)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: (మక్కా విజయం సందర్భంగా) మఖ్జూమ్ తెగకు చెందిన ఒక మహిళ[1] (ఫాతిమా బిన్తె అస్వద్) దొంగతనం చేసింది. ఈ వ్యవహారం ఖురైషులను చింతాగ్రస్తుల్ని చేసింది. ఖురైష ప్రముఖులు పరస్పరం సమాలోచన చేసుకున్నారు.[2] ఈ వ్యవహారంపై దైవప్రవక్త(సఅసం)తో చర్చించేదెవరు? అని ఆలోచించి, చివరకు ఉసామా బిన్ జైద్ (రజి) దీనికి తగిన వ్యక్తి అని కూడబలుక్కున్నారు. ఉసామా బిన్ జైద్(రజి) ఈ విషయమై సిఫారసు చేయగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు : “ఉసామా! ఏమిటి, నీవు దేవుడు విధించిన శిక్షలలో ఒకానొక శిక్ష గురించి నాకు సిఫారసు చేస్తున్నావా?” అని కోపగించుకున్నారు. ఆ తరువాత ఆయన(స) నిలబడి ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన(స) ఇలా అన్నారు: “పూర్వం గతించిన ఎన్నో సముదాయాలు నాశనమవడానికి కారణం (ఏమిటో తెలుసా?) వారు తమలోని ఒక మర్యాదస్తుడు దొంగతనం చేస్తే అతన్ని వదలిపెట్టేసేవారు. ఎవరయినా ఒక బలహీనుడు ఆ పనిచేస్తే మాత్రం అతనిపై శిక్షను అమలుపరిచేవారు. దైవసాక్షిగా చెబుతున్నాను. ఒకవేళ ముహమ్మద్(స) కూతురు ఫాతిమా దొంగతనం చేసి ఉన్నాసరే, నేను ఆమె చెయ్యి నరకడానికి వెనుకాడేవాణ్ణి కాను.”[3]

### దైవభీతి ప్రతిఫలం

**138)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు– మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించారు : “గత సమాజాలలోని ఒక వ్యక్తికి అల్లాహ్ పుష్కలంగా సిరిసంపదల్ని ప్రసాదించాడు. మరి అతనికి మరణసమయం ఆసన్నమైనప్పుడు, ఆ వ్యక్తి తన కొడుకులతో, ‘నేను మీ యెడల ఎలాంటి తండ్రిగా ఉన్నాను?’ అనడిగాడు. దానికి వారు, ‘మీరు మా పాలిట అత్యుత్తమ తండ్రిగా వ్యవహరించారు’ అని చెప్పారు. ‘కాని నేనైతే నా జీవితంలో ఏ మంచి పనీ చేయలేదు. అందువల్ల నేను చనిపోయాక నన్ను కాల్చేయండి. ఆపైన నా ఎముకల్ని బాగా దంచివేయండి. వేగంగా గాలి వీచే రోజున నా చితాభస్మాన్ని ఎగురవేయండి’ అని మరణ శాసనం చేశాడు. తండ్రి చెప్పినట్లే చేశారు ఆ కొడుకులు. అయితే అల్లాహ్ ఆ బూడిదను, ఎముకలను సమీకరించి, ‘నువ్వెందుకిలా చేశావ్?’ అని అడిగాడు. దానికి అతను, ‘నీ భయం వల్లనే ఇలా చెయ్యాల్సి వచ్చింద’ని చెప్పాడు. అందువల్ల అల్లాహ్ అతనికి తన కారుణ్య ఛాయలో చోటిచ్చాడు.”

### సడలింపుల వైఖరి

**141)** హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు: “ఒక వ్యక్తి జనులకు అప్పు ఇస్తూ ఉండేవాడు. అతను తన గుమాస్తాలకు ఈ విధంగా సూచనలు జారీ చేశాడు: ‘(నా రుణగ్రస్తులలో) ఎవరయినా మీకు కష్టాల్లో ఉన్నట్లు కనిపిస్తే అతని రుణాన్ని మాఫీ చేయండి. బహుశా ఈ సద్వ్యవహారం కారణంగా అల్లాహ్ మనల్ని క్షమించవచ్చు”. ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: “అతను అల్లాహ్‌ను కలుసుకున్నప్పుడు అల్లాహ్ అతన్ని క్షమించాడు.”

135-1. మఖ్జూమ్ తెగ ఖురైషులలో కులీన తెగగా భావించబడేది.

135-2. అంటే ఆమెకు ఎలాగయినా సరే శిక్ష పడకుండా చూడాలని వారు అనుకున్నారు.

135-3. దొంగతనం చేసినవాని చెయ్యి నరకాలన్న ఆదేశం మూసా(అ) షరీఅత్‌లో కూడా ఉండేది. ఈ శిక్షను క్రూర శిక్షగా భావించేవాడే క్రూరుడు. ఎవరయినా ఒక వ్యక్తి ముస్లిం అయివుండి ఈ శిక్షను అనాగరిక శిక్షగా పేర్కొంటే అతను ఇస్లామ్ పరిధిలో ఉండడు. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) దైవప్రవక్త(స)కు ఎంతో ప్రియతముడు. ఎందుకంటే ఈయన జైద్ బిన్ హారిసా (రజి) పుత్రుడు. జైద్ బిన్ హారిసా (రజి) ఒకప్పుడు మహాప్రవక్త(స) పెంపకంలో ఉండేవారు. చాలామంది జైద్‌ను ముహమ్మద్(స) కుమారునిగా తలపోసేవారు. అలా పిలిచేవారు కూడా. కాని అల్ అహ్జాబ్ సూరాలోని 5వ ఆయత్ అవతరించిన మీదట అలా పిలవటం మానుకున్నారు.



# 81 సర్వకాలిక ఆదర్శం

**- ఎస్.ఎమ్. మలిక్**

**ఇస్లామ్** వాస్తవానికి ఒక ఉద్యమం. అది ఒకే దేవుని ప్రభు సత్తా సిద్ధాంత ఆధారంగా మానవ జీవితాన్ని సంపూర్ణంగా నిర్మించ కోరుతుంది. ఈ ఉద్యమం అత్యంత ప్రాచీన కాలం నుంచి ఒకే ప్రాతిపదికన, ఒకే తీరులో కొనసాగుతోంది. దీనికి దైవ ప్రవక్తలన బడేవారు నాయకత్వం వహిస్తూ వచ్చారు. ఆ ఉద్యమంలో పాల్గొనాలని భావించేవారు ఆ నాయక మాన్యులను అనుసరించడం తప్ప మరో మార్గం లేదు. ఎందుకంటే ఆ విశిష్ట ఉద్యమానికి మరో పద్ధతి సుతరామూ సముచితం కాజాలదు.

ఈ సందర్భంలో ప్రవక్తల అడుగుజాడల్ని వెదకబోతే చాలా ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. పూర్వ కాలంలో గతించిన ప్రవక్తల వ్యవహరణా తీరును గురించి వివరాలు ఏవీ దొరకవు, కేవలం కొన్ని క్లుప్తమయిన సంకేతాలు మాత్రం ప్రాప్తమవుతాయి. వాటి ఆధారంగా పూర్తి కార్యాచరణ విధానాన్ని రూపొందించు కోలేము.

బైబిల్‌లోని కొత్త నిబంధన (New Testament)లో మహనీయ క్రీస్తు ప్రవచించిన కొన్ని అప్రామాణిక సూక్తులు లభిస్తాయి. వాటి ద్వారా ఇస్లామీయ ఉద్యమం ప్రారంభంలో ఏ విధంగా నడపాలో కొంత వరకు బోధపడుతుంది. అయితే తరువాతి దశల్లో ఎలా వ్యవహరించాలో సంకేత మాత్రంగానూ ఎటువంటి మార్గ దర్శకత్వం కానరాదు. వాస్తవానికి మహనీయ క్రీస్తుకు ఆ దశలు ఎదురవనే లేదు. అందువల్లనే ఏ విధమయిన మార్గ నిర్దేశన అటు నుంచి ప్రాప్తం కాదు

### సంపూర్ణ మార్గ నిర్దేశన

ఈ విషయంలో మార్గ బోధన లభించే ఒకే ఒక కేంద్రం మహనీయ ముహమ్మద్(స) జీవిత చరిత్ర. ఆయన వైపునకు చూడటం తప్ప గత్యంతరం లేదు. నిజానికి ఇస్లామ్ మార్గంలోని ఎత్తు పల్లాలను తెలుసుకునేందుకు ఆయన తప్ప మరో నాయకుడు, మరో దైవ ప్రవక్త ఆదర్శం, మానవ చరిత్ర అంతటా వెదకినా దొరకదు. అందరిలో కేవలం మహనీయ ముహమ్మద్(స) మాత్రమే, దైవ సందేశం ప్రారంభ దశ మొదలుగా సమాజం

పరిపూర్ణంగా సంస్కరణ జరిగే వరకు, సామాజిక వ్యవస్థ దైవాదేశాలకు అనుగుణంగా, పూర్తిగా నెలకొనే వరకు, ఒక్కో దశలో, ప్రతి కోణంలో ఆదర్శం అందజేసే దైవప్రవక్త చరిత్ర!

ఆయన జీవితం ద్వారానే ఆ ఉద్యమంలో అనుసరించవలసిన కార్యాచరణ విధానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాము.

## ఆయన ప్రభవించిన కాలం

ప్రవక్త ముహమ్మద్(స) ఇస్లామ్ సందేశాన్ని అందజేసేందుకు నియుక్తులయిన రోజుల్లో ప్రపంచమంతటా అనేక నైతిక, నాగరిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తు న్నాయి. రోమన్, పర్షియన్ సామ్రాజ్యాల ఛత్రాధిపత్యమూ ఉండేది. కులం, వర్గం ఆధారంగా వివక్ష కూడా పరిఢవిల్లుతూ ఉండేది. అధర్మమయిన ఆర్థిక దోపిడీ (Economic exploitation) కొనసాగుతూ ఉండేది. నైతిక నైచ్యమూ కానవచ్చేది. స్వయంగా మన దేశంలో కూడా ప్రబలిపోయిన ఈ సమస్యలు ఓ సంస్కర్త, ఓ నాయకుడు అవసరమని బహిరంగంగా చాటు తున్నాయి. ఎల్లెడలా అరాచకం, అజ్ఞానం, నైతిక దారిద్ర్యం, బీదరికం తాండవిస్తున్నాయి. బహరైన్ నుంచి యమన్ వరకు సముద్ర తీర రాజ్యాలు పర్షియా ఆక్రమణకు గురయి ఉన్నాయి. దానికి ఉత్తరాన అరబ్బు దేశాలన్నీ రోమను దురాక్రమణలో ఉండేవి. అక్కడ పెట్టుబడి దారుల గుప్పెట్లో చిక్కుబడిన అరబ్బులు కదలలేని దురవస్థలో ఉన్నారు. అరేబియా దక్షిణ పశ్చిమ నైరుతి తీరంలో అబీసీనియా పాలకుడు, ప్రవక్త ముహమ్మద్ ఆవిర్భావానికి కొన్నాళ్ల క్రితమే మక్కా నగరంపైకి దాడి జరిపాడు.

## సందేశం, ఒకే దైవం ఆధారంగా

పరిస్థితులు ఈ విధంగా ఉంటే, దైవం మనుషుల మార్గదర్శకత్వా నికి పంపిన నాయకుడు, ప్రపంచంలోని ఈ సమస్యల్లో దేని పరిష్కారానికీ ప్రాముఖ్యతనివ్వక, అనేక దైవాలను వదలి కేవలం ఒకే నిజ దైవం విధేయతను పాటించాలని పిలుపునిచ్చారు.

దానికి కారణం ఆ నాయకుని దృష్టిలో ఆ సమస్యల ప్రాముఖ్యత లేకపోవడం కాదు, వాస్తవంగా సకల సమస్యలకు మూలం మానవ దృక్కోణంలో మార్పు అన్న విషయం తెలుసుకోవడం. అందువల్ల ఏకోన్ముఖంగా ఆయన మూల సమస్యను పరామర్శించి దాన్ని పరిష్కరించి ఆ తరువాత ఆయన ఒక్కొక్క సమస్యను పూర్తిగా పరిష్కరించారు. ఎందుచేతనంటే మనిషి తన్ను తాను సర్వ స్వతంత్రుడనని భావించడం, బాధ్యతా రహితుడనని అనుకోవడం, మరో మాటలో తానే తనకు దైవమయిపోవటం వల్లనే లేదా దైవం కాక మరెవరినయినా తనకు ప్రభువని భ్రమించడం వల్లనే ఈ సకల చెడుగులు దారి చేసుకుంటాయన్న వాస్తవం ఎరిగిన వాడు ఆయన!

## సంస్కరణా పద్ధతి

ఇస్లామ్ దృష్టిలో ఈ మూల రోగం ఆంతర్యంలో దాగి ఉన్నంత కాలం పైపై మెరుగులు ఎన్ని దిద్దినా మనిషిలోని వ్యక్తిగత, సామూహిక చెడుగులు ఏ మాత్రం దూరం కావు. అందువల్ల సంస్కరణ అన్నది, మనిషికి తానూ ప్రభువు కాడు, మరే ఇతర మనిషీ, లేదా మరే దైవేతర శక్తీ ప్రభువు కాదు, కేవలం పరమ ప్రభువు దైవం ఒక్కడే, ఆయనే మనిషి సృష్టికర్త కావటాన ఆయనే నిజ ప్రభువు- ఈ సత్యాన్ని మనిషి అంగీకరించనంతవరకు ప్రపంచ పరిస్థితిలో మార్పు అనేది సాధ్యం కాదు. బుద్ధి, వాస్తవికత కోరేది ఏమిటంటే ఆ నిజ ప్రభువు సన్నిధిలో తలవంచి, మనిషి తన స్వయం సిద్ధ సిద్ధాంతాలన్నీ వదలి పెట్టి ఆయనకు దాసోహం అనడం!

నిజానికి ఈ లోకంలో ఎవరూ హిజ్ మెజిస్టీ, హిజ్ హెూలినెస్, హిజ్ లార్డ్ షిప్ లేరు, ఈ బిరుదులు సర్వం ఆయనకే చెల్లు. ఇక్కడ ఎవ్వరూ శాసన కర్తలు కారు, శాసన నిర్మాణం ఆయనకే చెల్లు. ఇక్కడ ప్రార్థనలు ఆలకించేవారు కూడా ఎవరూ లేరు, ఎందుకంటే ప్రార్థన ఆలకించి వరప్రదానం చేసే ప్రభుసత్తా ఆయనకు తప్ప మరెవరికీ లేదు. తొలి మనిషి మొదలు నేటి వరకు, ఇంకా ప్రళయం వరకు ఎదురయ్యే సమస్యలన్నీ ఈ ఒక్క సత్యం ఆధారంగానే పరిష్కృతమవుతాయి.

అందువల్లనే ప్రవక్త తన ఉద్యమ కార్యక్రమం ప్రారంభంలోనే మరే విషయాన్నీ ప్రస్తావించకుండా నేరుగా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు) అన్న విషయాన్ని ప్రకటిం చారు. ఎందుకంటే ఇదే- దేవుని ఏకత్వ ప్రకటనే ఇస్లామీయ ఉద్యమ మూల మంత్రం. దేవుని ఏకత్వ ప్రకటన కేవలం ఓ విశ్వాసం మాత్రమే కాదు, అది సంఘర్షణా నినాదం కూడా. మీరు ఈ నినాదంతో మీ కార్యక్రమం మొదలెట్టగానే అకస్మాత్తుగా భూమీ ఆకాశాలు మీకు శత్రువయినట్లు, అన్ని వైపులా మీ కొరకు పాములూ తేళ్ళూ అనేక క్రూర మృగాలు మిమ్మల్ని చుట్టు ముట్టినట్లు గ్రహిస్తారు.

ప్రవక్త ముహమ్మద్ ఈ నినాదాన్ని చాటినప్పుడు అదే జరిగింది. ప్రతి ఒక్కరూ ఈ నినాదాన్ని అణగ ద్రొక్కడానికే ప్రయత్నించారు. స్వయం సిద్ధ నాయకులు తమ నాయకత్వం, పెట్టుబడి దారు లకు తమ పెట్టుబడిదారీ, వర్గ పిపాసులకు తమ వర్గ తత్వం,

జాతీయ వాదులకు తమ జాతి పెద్దరికం- ఒక్క మాటలో ప్రతి విగ్రహారాధకునికి తన విగ్రహం పతనమయ్యే సూచన ఆ నినాదంలో అగుపించింది. ఆ సందర్భంలో కేవలం నిజమయిన సత్య కాముకులే తమ జీవితాలను పణంగా పెట్టి ముందుకు వచ్చి, ఒక్కొక్కరే సత్యాన్ని ఆశ్రయించారు. వారు ఎటువంటి నష్టానికీ వెరువ లేదు. తమ ప్రాణాలతో సహా సర్వస్వం కోల్పోవ డానికి సన్నద్ధులయ్యారు. అంతే కాదు, స్త్రీ, సిరి, అధికారం, వీలయిన ప్రతి దాన్నీ అందజేసి కొనడానికి సిద్ధమయిన వారికి నిరాశే ఎదురయింది.

## ప్రేమ పోరులో అమరగతి

ఆ సైద్ధాంతిక ప్రేమ మార్గంలో అడుగిడిన వారు నిజానికి మానవ సంతతిలోని నవనీతం. అలాంటి వారే ఈ ఉద్యమానికి అవసరం కూడాను. వారికి ఎదురయిన అగ్ని పరీక్షల్లో నెగ్గి ఎంత కాలితే అంతే కుందనం అయిన వారి ద్వారా ఇస్లామీయ ఉద్యమం వ్యాపిస్తూ దృఢపడుతూ వృద్ధి చెందుతూ ఉంది. వీరంతా సత్యం, యదార్థం కొరకు ప్రపంచ ప్రయోజనాలన్నీ త్యాగం చేసిన సత్య ప్రియులు. దేవుని ఏకత్వ ఉద్యమంలో ప్రతి సత్య ప్రియుడూ ఈనాడు కాకపోతే ఏనాటికయినా పరుగిడి రావలసిందే.

## పరిపూర్ణ ఆదర్శం

ఆ ఉద్యమ నేత ప్రవక్త ముహమ్మద్(స) తన జీవితం ద్వారా తననూ ఉద్యమ సిద్ధాంతాలనూ సూత్రాలనూ ప్రతి దాన్నీ సంపూర్ణంగా, ఆచరణాత్మకంగా వివరిస్తూ పోయారు. స్వయంగా తననూ తన నాయకత్వంలో ప్రవర్ధమానం అవుతున్న ఉద్యమాన్నీ ఓ సరయిన, ఎల్లకాలాలకు సరిపడే ఆదర్శంగా రూపొందించారు.

ఆయన ఇల్లాలు మహనీయ ఖదీజా ఆ ప్రాంతంలో సంపన్నురాల యిన మహిళ. ప్రవక్త ఆవిడ గారి ధనం ద్వారానే వ్యాపారం చేసేవారు. ఇస్లామ్ సందేశం ప్రారంభమవగానే ఆలుమగలు ఇరువురూ తమ వాణిజ్య ధనం మొత్తాన్ని ఉద్యమ వ్యాప్తి కొరకు ఖర్చు పెట్టేశారు. చివరికి పరిస్థితి ఏ మేరకు విషమించిందంటే ప్రవక్త ధర్మ ప్రచారంలో తాయిఫ్‌కు ప్రయాణమయినప్పుడు, ఓ కాలంలో గొప్ప వాణిజ్యవేత్త, ప్రయాణానికి వాహనం లేక కాలి నడకన పోవలసి వచ్చింది.

ఆయనకు, ఆ ఉద్యమాన్ని విరమించుకుంటే సుందర యువతితో సహా, సిరి సంపదలు, రాజ్య నాయకత్వం వరకు ఏవేవో పాదాక్రాంతమవుతాయని ఎన్నో ప్రతిపాదనలు ముందుంచారు కురైష్ నాయకులు. అయితే మానవ శ్రేయం కొరకు ఆవిర్భ వించిన ఆ వ్యక్తి దూషణలనే కాదు రాళ్ళ దెబ్బలనూ భరించడానికి సిద్ధమయ్యాడు కాని వారి ప్రతిపాదనలన్నింటినీ త్రోసిపుచ్చాడు.

కురైష్ నాయకులు తాము ప్రవక్త మాటలు వినడానికి ఆయన వెంట నిత్యం సన్నిహితంగా ఉండే బీదాబిక్కి జనాన్ని, బానిసల్ని, కడమ జాతి వారిని తొలగించాలని కోరినప్పుడు మానవుల మధ్య తారతమ్యాలను రూపుమాపి సమానతను నెలకొల్పడానికి అరుదెంచిన ఆ మహనీయుడు, ఆ శ్రీమంతుల కొరకు నిరుపేదల్ని ఛూత్కరించడానికి సుతరామూ అంగీకరించడు.

## నిరుపమ అమానతు దారుడు

మక్కా వదలిపోవలసి వచ్చినప్పుడు, తన శత్రువులే అయిన కురైష్ నాయకులు భద్రత కోసం తన వద్ద దాచిపెట్టుకున్న అప్పగింతలన్నీ, ఎవరివి వారికి తిరిగి అప్పజెప్పేందుకు మహనీయ అలీని నియమించి వెడతారు ముహమ్మద్(స).

ఆయన కురైష్ తెగ సమున్నతి కొరకు ఈ ఉద్యమాన్ని మొదలెట్ట లేదు. అలాగయితే అబీసీనియాకు చెందిన బిలాల్‌నీ, రోమను అయిన సుహైబ్‌నీ, పర్షియన్ సల్మాన్‌నీ ఎందుకు చేరదీసేవాడు, వారెందుకు ఈయనకు తోడ్పాటు నిచ్చేవారు?

## అసమానమయిన పరిపాలనా దక్షత

మక్కాలో పదమూడు సంవత్సరాల నిరంతర కృషి తరువాత ఓ చిన్న ఇస్లామీయ రాజ్యం మదీనాలో ఏర్పడుతుంది. అప్పటికి ఓ పరిపాలనా వ్యవస్థను నడపడానికి అవసరమయిన పాలనా యంత్రాంగం కొరకు ముస్లిమ్ కార్యకర్తలు సన్నద్ధమయ్యారు. ఆ ఇస్లామీయ రాజ్యానికి పది సంవత్సరాల వరకు మార్గదర్శ కత్వం వహించి ప్రవక్త మహనీయులు, తన తరువాత ఆ రాజ్యాన్ని ఇస్లామీయ విధానంలో ఎలా నడపాలో ఆచరణాత్మకంగా తర్ఫీదు నిచ్చారు తన అనుచరులకు. ఆ కాలంలో ఇస్లామ్ సిద్ధాంతం కేవలం ఓ సిద్ధాంతం (Abstract Idea)గా కాక ఓ పరిపూర్ణ

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

నాగరికతగా పరిణామం చెందింది. అందులో ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థ, విద్యావ్యవస్థ, న్యాయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, ఇంకా యుద్ధం, అంతర్జాతీయ పాలిసీ, తదితర రంగాలన్నిటా సకల విషయాలకు చెందిన ప్రతి కోణం ప్రస్ఫుట పరచడం జరిగింది.

ఒక నగరం వరకు పరిమితమయిన ఇస్లామీయ రాజ్యం క్రమేణ అరేబియా మహారాజ్యంగా పరిణామం చెందింది. ఆ తరువాత, ఇస్లామ్ బద్ధ శత్రువులు సయితం, ఏ సిద్ధాంతంతో తాము ఏళ్ళ తరబడి పోరాడుతూ వచ్చారో కడకు ఆ సిద్ధాంతాన్నే మానవులకు నిజమయిన శ్రేయస్కర వ్యవస్థ అని అంగీకరించవలసి వచ్చింది. ఖాలిద్ బిన్ వలీద్, అబూ జహల్ కుమారుడు ఇక్రిమా, అబూ సుఫ్యాన్, హమ్జాను చంపిన వహ్షీ, ఉత్బా కూతురు హింద్ కూడా, ఏ వ్యక్తిని తమ దృష్టిలో అత్యంత దుష్టునిగా భావించేవారో ఆ వ్యక్తి సత్యత సమక్షంలో తలవంచవలసి వచ్చింది.

## తప్పుడు ప్రచారం

చరిత్ర కారులు తప్పుగా యుద్ధాల వివరాలను ఎంతగానో ప్రచారం చేయడం వల్ల, అరేబియాలో వచ్చిన ఆ విప్లవం యుద్ధాల ద్వారా వచ్చిందన్న భ్రమ కలిగింది. నిజానికి కేవలం అయిదేళ్ళు మాత్రం జరిగిన ఆ యుద్ధాల్లో ప్రాణ నష్టం, ఇరువైపులా మొత్తం వెయ్యి, పన్నెండు వందల కన్నా అధికం కాదు. ప్రపంచంలో వచ్చిన విప్లవాలను దృష్టిలో ఉంచుకుంటే ఈ విప్లవాన్ని రక్తపాత రహిత విప్లవంగానే అంగీకరించవలసి వస్తుంది. పైగా ఈ విప్లవం ద్వారా కేవలం ప్రభుత్వం, పాలనా వ్యవస్థ మాత్రమే మారలేదు, మనుషుల దృష్టి కోణం, ఆలోచనా విధానం, జీవన విధానం, నైతిక విలువలు, అలవాట్లు, గుణాలు, అంటే సర్వం పరివర్తన చెంది సరికొత్త జాతి ఏర్పడటమే కాక జాతీయ ప్రమాణాలతోపాటు ఓ జాతి పూర్తిగా ఆపాదమస్తకం పరివర్తిత్వం అయిందన్న మాట.

వ్యభిచారులు స్త్రీ మాన రక్షకులుగా, సారాయి ప్రేమికులు సారా నిషేధ ఉద్యమ ధ్వజ వాహకులుగా రూపొందారు. దొంగలు దోపిడీదారులు ఎంతగా నిజాయితీ పరులయ్యారంటే ఓ సాధారణ సిపాయికి రాజ కిరీటం చేజిక్కితే, నిస్వార్థంగా తన నిజాయితీ ప్రచారం జరగరాదని ఆ కిరీటాన్ని రాత్రి వేళ తన అతుకుల బొంతలో దాచుకుంటూ పోయి, తమ నాయకునికి అప్పజెప్పాడు. ఇంకా వారు అధర్మం తమ వల్ల జరగరాదని అడుగడుగునా భయపడుతూ మిత్రుల ఇంట కూడా భోజనానికి జంకేవారు. మనిషి ప్రాణం అంటే ఏమాత్రం విలువలేని వారు, తమ స్త్రీ సంతానాన్ని చేతులారా పూడ్చి పెట్టేవారు, అటువంటి వారిలో ప్రాణం పట్ల మర్యాద ఎంత పెరిగిందంటే, ఓ మామూలు పక్షిని అనవసరంగా చంపడాన్నీ సహించేవారు కారు. వారి పౌరులలో ఎటువంటి దైవభీతి చోటుచేసుకుందంటే తమ వల్ల పాపం జరగ్గా దానికి మృత్యు దండనే శిక్ష అని తెలిసినా, తమ పాపాన్ని అంగీకరించి శిక్ష విధించి పాప విముక్తి కలిగించవలసిందని ప్రాధేయపడేవారు. ఈ మానసిక, నైతిక పరివర్తన యుద్ధం, కరవాలం వల్ల సాధ్యమా?

వాస్తవానికి వింతయిన విషయం ఏమిటంటే పదమూడు ఏళ్ల వరకు కేవలం రెండున్నర మూడు వందల మంది ముస్లిములవగా ఆ తరువాత పదేళ్ల కాలంలో దేశం మొత్తం ముస్లిమ్ అయి పోయింది! ఈ చిక్కును ఛేదించలేక జనం, రకరకాలుగా వింతయిన కారణాలు వెదుకుతారు. కాని విషయం స్పష్టంగానే ఉంది.

ఆ కొత్త సిద్ధాంతం ఆధారంగా జీవన వ్యవస్థ ఏర్పడనంతవరకు ఈ విచిత్రమయిన నాయకత్వం చేయదలచుకున్నదేమిటో జనం అర్థం చేసుకోలేకపోయారు. రకరకాల ఊహాగానాలు చేశారు. ఆ సందర్భంలో కేవలం అసమాన వివేచన గలవారే ఆయన్ని అర్థం చేసుకున్నారు, విశ్వసించారు. కాని ఆ సిద్ధాంతం ఆధారంగా ఓ జీవన వ్యవస్థ ఏర్పడగానే జనం దాని సత్ఫలితాలను కళ్ళారా చూసుకున్నారు, అప్పుడుగాని వారికి నిజం దర్శనమివ్వ లేదు. ఇక యదార్థాన్ని త్రోసిపుచ్చే ఆస్కారం లేకపోయింది.

ఇదీ ఆ ఆదర్శ మూర్తి నెరిపిన ఉద్యమం, దాని విధానం, ఫలితాలు. నేడు కూడా ఆ ఆదర్శాన్ని అనుసరించి కృషి సలపినట్ల యితే ఆ ఫలితాలే ప్రాప్తం కాగలవు. అయితే ఈ కార్య నిర్వహణ కొరకు నిజ విశ్వాసం, ఇస్లామీయ స్ఫూర్తి, అచంచల ఏకాగ్ర చిత్తం, దృఢమయిన నిర్ణయ శక్తి, వ్యక్తిగత కోరికలు ఆశల త్యాగం ఎంతో అవసరం. సమాజం, కుటుంబం, జాతీయ కాంక్షలు - వేటినీ తన ధ్యేయ మార్గాన అడ్డు రాకుండా సమర స్ఫూర్తితో ముందుకు సాగి దైవ వచనాన్ని ఉన్నత పరచాలి. అప్పుడే ఆ సమర శీలుని ఆదర్శం సంపూర్ణ రూపం ధరించగలదు.

***ఆధారం*** : *సీరతె సర్వరె ఆలమ్. 3వ సంపుటి : 447 - 458*

(సమాప్తం)

# గర్వ భంగం -1

– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**గర్వం, అహంకారం, పొగరుమోతుతనం –** ఇవి మనిషిని శీఘ్రంగా పతనం వైపునకు తీసుకుపోయే దుర్గుణాలు. అల్లాహ్ ఆదం పుత్రుడైన మనిషికి గౌరవం, పెద్దరికం ప్రసాదించాడు. నేలపైనా, నీటిలోనూ నడిచే వాహనాలను అతనికి ఇచ్చాడు. తినడానికి పరిశుద్ధమైన ఆహారాన్ని ఇచ్చాడు. ఆయన సృష్టించిన ఎన్నో ప్రాణులపై మనిషికి ఆధిక్యతను కూడా ప్రసాదించాడు.

ముమ్మాటికీ ఇది దైవానుగ్రహమే. దీనిని మనిషి తెలుసుకుని మసలాలి. తనకు ఇవ్వబడిన 'పెద్దరికాన్ని' తన స్థాయికి శోభించే విధంగా వినియోగించాలి. అంతేగాని గర్వంతో నిక్కుతూ నడవ కూడదు. అదిరిపాటు పడకూడదు. అతనెంతగా ఎగిరెగిరిపడినా అతను భూమిని చీల్చనూ లేడు, పర్వతాల ఎత్తుకు చేరనూ లేడు. అతనెంత విర్రవీగినా ఆరున్నర అడుగులకన్నా ఎక్కువ ఎత్తుకు ఎదగడు.

అణకువ, వినయ వినమ్రతలు మాత్రమే మనిషికి శోభనిస్తాయి. అతనిలోని మృదుత్వం మార్దవాలే అతని ప్రతిభకు వన్నె తెస్తాయి. అల్లాహ్ కాఠిన్యం ద్వారా ప్రసాదించని దానిని మృదుత్వం, మెతకదనం ద్వారా ప్రసాదిస్తాడు.

అసలు గొప్పదనం, పెద్దరికం అనేది దైవానికే శోభాయమానం. అల్లాహ్‌కు గల పేర్లలో ఒక పేరు **'అల్ ముతకబ్బిర్'** అంటే గొప్పదనం కలవాడు. అలాగే ఆయనకు గల పేర్లలో ఒకటి **'అల్ కబీర్'.** అంటే అందరికంటే గొప్పవాడు.

> **"భూమ్యాకాశాలలో ఘనత్వం, గొప్పతనం అల్లాహ్‌కు మాత్రమే చెందుతుంది. శక్తిమంతుడూ వివేకవంతుడు ఆయన మాత్రమే."** (అల్ జాసియహ్ : 37)

హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

> "ఘనత (గొప్పతనం) నా శాలువా. ఔన్నత్యం నా ఇజారు (అంగ వస్త్రం). కనుక ఎవరయితే ఈ రెండింటిలో ఏ ఒక్క దానినయినా సరే నా నుండి లాక్కునేందుకు ప్రయత్నిస్తే నేనతన్ని నరకంలో పడవేస్తాను." (సుననె అబూ దావూద్)

గర్వాహంకారం మనిషి దౌర్భాగ్యానికి ద్వారం వంటిది. అంటే గర్వం మూలంగానే మనిషి దౌర్భాగ్యాన్ని చేజేతులా కొని తెచ్చు కుంటాడు. దానికి అతిపెద్ద నిదర్శనం ఇబ్లీస్ దౌర్భాగ్యానికి ఆరంభం. వాడు దైవాజ్ఞను శిరసావహించడానికి నిరాకరించాడు. తన పెద్దరికపు అహంకారంతో ఆదమ్(అ) కన్నా తాను గొప్పవాణ్ణని తలపోశాడు. అందుకే అతను శాశ్వతంగా దైవ కారుణ్యానికి దూరం చేయబడ్డాడు. ప్రళయదినం వరకూ శాపగ్రస్తునిగా ఖరారు చేయబడ్డాడు.

> **మేము దూతలకు, "మీరు అందరూ ఆదమ్‌కు సాష్టాంగ పడండి" అని ఆదేశించినప్పుడు, వారందరూ సాష్టాంగ పడ్డారు. కాని ఇబ్లీసు ధిక్కరించాడు. దురహంకారానికి గురయ్యాడు. అవిధేయులలో కలసిపోయాడు. (2: 34)**

''ఆదమ్(అ)కు సాష్టాంగపడమని నేను ఆజ్ఞాపించినప్పుడు, నీవు సాష్టాంగపడకుండా అడ్డుకున్న వస్తువేది?'' అని అల్లాహ్ అడిగితే

**'నేను అతనికంటే ఘనుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు. అతన్ని మట్టితో సృష్టించావు' అని ఇబ్లీస్ సమాధానమిచ్చాడు. (అల్ ఆరాఫ్: 12)**

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"సరే, అయితే ఇక్కణ్ణుంచి కిందకి దిగు. ఇక్కడ నీ గొప్పతనాన్ని గురించి గర్వపడే హక్కు నీకు లేదు. వెళ్ళిపో. వాస్తవానికి నీవు తమ పరాభవాన్ని తామే కోరుకునే వారిలోని వాడవు." (అల్ ఆరాఫ్ : 13)**

వెనుకటి జాతుల గాథలను శోధించినప్పుడు మనకు బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే నూహ్ జాతివారు, ఆద్, సమూద్, మద్యన్ జాతి ప్రజలు కేవలం గర్వం కారణంగానే తమ ప్రవక్తల సందేశాన్ని తిరస్కరించారు.

అలాగే ఖారూన్, ఫిరౌన్, హామాన్‌ల గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"ఖారూన్, ఫిరౌన్, హామాన్‌లను మేము నాశనం చేశాము. మూసా వారి వద్దకు స్పష్టమైన సూచనలతో వచ్చాడు. కాని వారు తమ పెద్దరికం గురించి భువిలో విర్రవీగారు. యదార్థానికి వారు మమ్మల్ని దాటి పోగలిగే వారేమీ కాదు."**

**(అల్ అన్‌కబూత్ : 39)**

ఖారూన్ అపారమైన తన ఖజానాలను చూసుకుని గర్వాతిశయంతో దైవాజ్ఞలను ధిక్కరించాడు. కాని అతని ఖజానాలు అతనిని దైవాగ్రహం నుండి కాపాడలేకపోయాయి. అతని ఖజానాలతో సహా అల్లాహ్ అతనిని భూమిలో అణగదొక్కాడు.

ఫిరౌన్, అతని సైనికులు రాజ్యాలలో చెలరేగిపోయారు. ''నేనే మీ ప్రభువును. అందరికన్నా ఉన్నతుణ్ణి'' అని ఫిరౌన్ తన జాతి వారితో అనేవాడు. అందుకే అల్లాహ్ ఫిరౌన్‌ను, అతని సేనలను పట్టుకుని, వారిని సముద్రంలో ముంచివేశాడు.

అలాగే -

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) మక్కాలో ఏకేశ్వరోపాసనా సందేశాన్ని అందజేసినప్పుడు మక్కాలోని సత్య తిరస్కారులు దానిని ఎగతాళి చేశారు. కారణం వారిలోని గర్వమే.

**"వారెలాంటి వారంటే, "అల్లాహ్ తప్ప మరొక సత్యమైన ఆరాధ్యుడు లేడు" అని చెప్పినప్పుడు, వారు అహంకారంతో, "మేము ఒక పిచ్చి కవి కోసం మా దేవుళ్ళను వదలుకోవాలా?" అని అనేవారు.** (అస్ సాఫ్ఫాత్ : 35, 36)

వారి ప్రేలాపనలకు జవాబుగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"వాస్తవానికి అతను (ముహమ్మద్-స) సత్యాన్నే తెచ్చాడు. దైవ ప్రవక్తలను ధ్రువీకరించాడు." (ఇప్పుడు వారితో ఇలా అనటం జరుగుతుంది) "మీరు తప్పనిసరిగా బాధాకరమయిన శిక్ష చవిచూస్తారు. మీకు ఏ ప్రతిఫలం ఇవ్వబడుతూ ఉన్నా అది మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలమే." (37: 37, 38)**

ఇక ఈ గర్వాహంకారానికి దూరంగా ఉండేవారిని అల్లాహ్ ఏవిధంగా మెచ్చుకున్నాడో చూడండి-

**"భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న సమస్త జీవరాసులూ, సర్వ దైవదూతలూ అల్లాహ్ ముందు సాష్టాంగపడుతున్నారు. వారు ఎంత మాత్రం తలబిరుసుతనంతో ప్రవర్తించరు. వారు తమపైన ఉన్న ప్రభువునకు భయపడతారు. తమకు ఇవ్వబడిన ఆదేశం ప్రకారమే పనిచేస్తారు." (అన్ నహ్ల్ : 49, 50)**

మరీ ముఖ్యంగా దైవదూతల గురించి ఇలా సెలవీయబడింది:

**"భూమిపైనా, ఆకాశాలలోనూ సృజించబడినవన్నీ అల్లాహ్‌వే. ఆయన వద్ద ఉండే (దైవదూతలు) వారు తమను తాము గొప్ప వారుగా భావించుకుని ఆయన దాస్యాన్ని ధిక్కరించరు, బాధపడరు కూడా. రేయింబవళ్ళు ఆయన స్తోత్రం చేస్తూనే ఉంటారు, విశ్రమించరు." (అల్ అంబియా : 19, 20)**

అలాగే అల్లాహ్ తన విశిష్ట దాసుల గుణగణాలను ప్రస్తావిస్తూ ఇలా సెలవిచ్చాడు :

**"ఈ వాక్యాలను వినిపించి హితబోధ చేసినప్పుడు సజ్దాలో పడేవారూ, తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన పరిశుద్ధతను**


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల సాపురాయి
గీటురాయి
వారపత్రిక

కొనియాడేవారూ, గర్వపడని వారు మాత్రమే మా వాక్యాలను విశ్వసిస్తారు. వారి వీపులు పడకలకు ఎడంగా ఉంటాయి; తమ ప్రభువును వారు భయంతోనూ, ఆశతోనూ వేడుకుంటారు. మేము వారికి ప్రసాదించిన ఉపాధి నుండి ఖర్చు పెడతారు. వారి కర్మలకు ప్రతిఫలంగా, కళ్ళకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిందో ఆ సామగ్రిని గురించి ఏ ప్రాణికీ తెలియదు." (అస్ సజ్‌దహ్ : 15-17)

## గర్వం : మూడు రకాలు

**1) అల్లాహ్ పట్ల గర్వం :** ఉదాహరణకు ఫిరౌన్, నమ్రూద్‌ల గర్వాహంకారం. వారు తమను తాము అల్లాహ్‌కంటే ఉన్నతులుగా ఊహించుకున్నారు. అల్లాహ్ ఆదేశాలను శిరసావహించడానికి నిరాకరించారు.

**2) దైవప్రవక్త(సఅసమ్) పట్ల గర్వాహంకారం :** మక్కాలోని సత్య తిరస్కారులు ఆయన(స) పట్ల ఇలాగే గర్వాతిశయంతో విర్రవీగారు. తమను ప్రవక్త(స) కన్నా శ్రేష్టులుగా భావించారు. ఆయన సందేశాన్ని నిరాకరించినది గాక, ఆయన్ని (స) పరిహసించారు.

ఒక వ్యక్తి దైవప్రవక్త(స) సమక్షంలో ఎడమ చేత్తో భోజనం చేయసాగాడు. "కుల్ బియమీనిక (నీ కుడి చేత్తో తిను)" అని ఆయన(స) ఉపదేశించారు. దానికి అతను, 'నేనలా తినలేను' అన్నాడు. అంటే కుడిచేత్తో తినటం నా వల్ల కాదని చెప్పాడు. "ఇక ఎన్నడూ నీకు ఆ శక్తి ఉండదు. కేవలం గర్వాతిశయం కారణంగానే ఇతను నా మాటను అంగీకరించలేదు" అని దైవప్రవక్త(స) చెప్పారు.

అంతే, ఆ రోజు తర్వాత ఆ వ్యక్తి తన జీవితంలో ఎన్నడూ కుడిచేత్తో తినలేకపోయాడు (సహీహ్ ముస్లిం)

**3) దైవదాసుల పట్ల గర్వం ప్రదర్శించటం :** అంటే తనను తాను వారికన్నా ఉత్తమునిగా ఊహించుకోవటం, వారిని అల్పులు క్రింద జమ కట్టడం.

ఎవరయినా దైవదాసుల పట్ల గర్వం ఎందుకు ప్రదర్శిస్తారు? దానికి కారణాలనేకం ఉండవచ్చు.

- కొంతమంది వంశం, వర్ణం, కుటుంబం ఆధారంగా గర్వం ప్రదర్శిస్తారు.
- కొంతమంది సిరిసంపదల, ఆస్తీ అంతస్తుల ఆధారంగా గర్వం ప్రదర్శిస్తారు.
- కొంతమంది సౌందర్యం ప్రాతిపదికపై గర్వంతో విర్రవీగుతారు.
- కొందరు బలపరాక్రమాల ఆధారంగా గర్వాహంకారం చూపుతారు.
- మరికొందరు తెలివితేటల, ప్రజ్ఞాపాటవాల ఆధారంగా బీరాలు పోతారు.
- కొంతమంది జ్ఞానం, దూరదృష్టి ఆధారంగా తమను తాము గొప్పవారుగా ఊహించుకుంటారు.

ఇలా గర్వానికి కారణాలు ఎన్నో ఉంటాయి.

**(ఇంకా వుంది)**


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ఫేక్ న్యూస్ రౌండప్




**అమెరికా**కు చెందిన ఒక ప్రతినిధికి భారతదేశం వీసా నిరాకరించిందన్న వార్త ఇటీవల వైరల్ అయ్యింది. ఫాదర్ థామస్ రీస్ సిబిన్ న్యూస్ యాంకర్‌తో మాట్లాడుతూ ఈ మాటలు చెప్పినట్లు వీడియోలో కనిపిస్తోంది. అమెరికా కమీషన్ ఆన్ ఇంటర్నేషనల్ ఫ్రీడం బృందానికి ఇండియా వీసా నిరాకరించిందని ఆయన చెబుతున్నాడు. ఈ బృందం మణిపూర్ సందర్శించాలనుకుంటే భారత ప్రభుత్వం వీసా నిరాకరించిందని వార్త వైరల్ చేశారు. ఈ వీడియోను ప్రశాంత్ భూషణ్ వంటి ప్రముఖ న్యాయవాది కూడా రీ ట్వీట్ చేశారు. కాని వాస్తవానికి ఈ వీడియో మార్చి 2016 నాటిదని బూమ్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో తెలిసింది. ఈ ఇంటర్వ్యూ 2016లో జరిగింది. ఇప్పుడు ఇచ్చిన ఇంటర్వ్యూ కాదు. పాత ఇంటర్వ్యూను మణిపూర్ సంఘటనల నేపథ్యంలో వైరల్ చేస్తున్నారు. మరో వైరల్ వీడియోలో ఒక మహిళ హిందువులను ఉద్దేశించి మాట్లాడుతోంది. హిందు అమ్మాయిల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, ముస్లిం అబ్బాయిలకు దూరంగా ఉండేలా చూడాలని, లవ్ జిహాద్ గురించి అమ్మాయిలను అప్రమత్తం చేయాలని చెబుతోంది. ఈ మాటలు చెబుతున్న మహిళ పేరు కాజల్ షింగాలా అని ఆమె ఐపియస్ అధికారి అని ప్రచారం చేశారు. 'ది క్వింట్' వార్తా సంస్థ నిజనిర్ధారణ ప్రకారం ఈ వీడియోలో కనిపించే మహిళ కాజల్ షింగాలా. ఆమె కాజల్ హిందూస్తానీ అనే పేరు కూడా పెట్టుకుంది. ఒక హిందూత్వ కార్యకర్త. పోలీసు అధికారి కానే కాదు. గుజరాత్‌లోని ఉనాలో ఘర్షణలకు కారణమైన విద్వేష ప్రసంగం చేసిందని ఏప్రిల్ 9వ తేదీన ఆమె అరెస్టు కూడా అయ్యింది కాని ఏప్రిల్ 13వ తేదీన ఆమెకు బెయిలు దొరికింది. పోలీసు అధికారిగా ఆమెను చిత్రీకరించి లవ్ జిహాద్ అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారు. ఇంకో ఫేక్ వార్త చూద్దాం. ఇద్దరు అమ్మాయిలు ఒక వ్యక్తిని బెల్టుతో చావబాదుతున్న వీడియో అది. ఈ సంఘటన గుజరాత్‌లో జరిగిందిగా ప్రచారం చేశారు. ఒక స్కూలులో చదువుతున్న ఒక హిందూ అమ్మాయిపై ఒక ముస్లిం లైంగికంగా దాడి చేయడానికి ప్రయత్నించాడని, జనం పట్టుకుని వాడిని చావబాదారని ప్రచారం చేశారు. ముస్లిములపై విద్వేషం పెంచేవిధంగా ఈ రాతలున్నాయి. ది క్వింట్ వార్తాసంస్థ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, ఈ సంఘటన గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగింది. వీడియో జూన్ 24వ తేదీ నాటిది. ఆ వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు విజయ్ సార్కటే అని తెలిసింది. ఒక మైనర్ అమ్మాయి వెంటపడి లైంగికంగా వేధించినందుకు జనం చావబాదారు. తర్వాత కగాడా పీఠ్ పోలీసులు వాడిని అరెస్టు చేశారు. ది క్వింట్ వార్తాసంస్థ పోలీసులను కూడా సంప్రదించింది. పోలీసులు కూడా నేరస్తుడి పేరు విజయ్ సార్కటే అని నిర్ధారించారు. ఒక సంఘటనలో నేరస్తుడిని ముస్లింగా అబద్ధపు ప్రచారం చేసి విద్వేషం పెంచే ప్రయత్నాలు చేశారు. ఇంకో ఫేక్ వార్త చూద్దాం. బీజేపీ కండువాలు ధరించిన కొందరిని జనం కొడుతున్న వీడియో ప్రచారంలోకి వచ్చింది. పశ్చిమబెంగాల్లో హిందువులకు ప్రవేశం నిరాకరించే నో గో ప్రాంతాలున్నాయని, ఆ ప్రాంతాల్లో కేవలం రోహింగ్యాలను, లేదా ముస్లిములను మాత్రమే అనుమతిస్తున్నారని, పశ్చిమ బెంగాల్లో హిందువుల పరిస్థితి ఇలా ఉందని, ఇదంతా మమతా బెనర్జీ ఓటు బ్యాంకు రాజకీయాలని ప్రచారం చేశారు. జులై 8న పంచాయతి ఎన్నికలకు ముందు ఈ వైరల్ ప్రచారం మొదలయ్యింది. బీజేపీ ఎం.పీ. దిలీప్ ఘోష్ కూడా దీన్ని ప్రచారంలో పెట్టాడు. కాని ఈ వీడియో నిజనిర్ధారణలో తెలిసిన విషయాలు వేరుగా ఉన్నాయి. ఇది 2017 నాటి వీడియో. బీజేపీ ఎం.పి. దిలిప్ ఘోష్ ఆయన అనుచరులపై గూర్ఖాల్యాండ్ జనముక్తి మోర్చా కార్యకర్తలు దాడి చేసిన వీడియో అది. ది క్వింట్ వార్తా సంస్థ ఈ విషయాలు రాస్తూ 2019లోను, 2020లోను రెండు సార్లు ఈ వీడియో ఇదేవిధంగా అబద్ధపు ప్రచారంతో వైరల్ అయ్యిందని. అప్పుడు కూడా ఈ అబద్ధాలను బట్టబయలు చేశామని రాసింది. పశ్చిమ బెంగాల్లో హిందువుల ప్రవేశం నిషిద్ధమనే ప్రాంతాలున్నాయని చెప్పడం అబద్ధమని రాసింది.

# సుందరాంగులు

- షేక్ అబ్దుల్ బాసిత్, కొత్త గూడెం



**ఏరా అబ్బాయ్!** ఏ టీవీ చానెల్‌లో చూసినా 72 సుందరాంగుల చర్చే నడుస్తుంది. చచ్చాక మీరు మస్తుగా ఎంజాయ్ చేయవచ్చు అన్నమాట.

చూడు శంకర్ అన్న! అది ఇక్కడ ఎలా జీవిస్తే లభిస్తుందో కూడా జర చెబితే బాగుండేది.

అరే అదేంది బాయ్, అంతా క్లియర్‌గా చెప్పిండ్రు కదా. ముస్లింలు కాని వారిని చంపితే అంటే జిహాద్ చేసే వారికి అల్లాహ్ స్వర్గంలో 72 సుందరాంగులను బహుమానంగా ఇస్తాడు అని.

చూడు రాజు అన్న. అసలు జిహాద్ అంటే ఏమిటో ముందు తెలుసుకో.

నువ్వు చెప్పు తమ్ముడు.

జిహాద్ అంటే నిరంతర కృషి. సమాజంలో చెడును నిర్మూలించడానికి న్యాయాన్ని ధర్మాన్ని మంచిని పెంచడానికి చేసే ప్రయత్నం.

"తన మనోవాంఛలను అణచి వేయడానికి చేసే కృషి అన్ని జిహాద్‌లో కన్న ఉత్తమ జిహాద్" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

అంటే మనస్సు కోరే గొంతెమ్మ కోర్కెలను అణిచివేసి నీతిగా నిజాయితీగా జీవించాలి.

ఖురాన్‌లో స్వర్గం ఎలాంటి వారి కోసమో తెలుపుతూ ఇలా చెప్పడం జరిగింది.

ఆ స్వర్గం దైవభక్తి, దైవభీతి కలవారికి వాగ్దానం చేయబడింది, అది వారి కర్మలకు ప్రతిఫలం. వారి ప్రయాణానికి చివరి గమ్య స్థానం, అందులో వారి ప్రతి కోరికా తీరుతుంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. దానిని ప్రసాదించటం అనేది నీ ప్రభువు తప్పని సరిగా నెరవేర్చవలసిన ఒక వాగ్దానం. (25:15-16)

పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలముయింది. ఆది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం- వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీల కార్యం వారివల్ల జరిగిపోతే లేదా ఏదైనా పాపంచేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే, వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు- తప్ప పాపాలను క్షమించగలిగే వాడెవడు

న్నాడని- వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువువద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే, ఆయన వారిని క్షమిస్తాడు. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలలోకి వారిని ప్రవేశింప జేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచిపనులు చేసే వారికి ఎంతచక్కని ప్రతిఫలం! మీకు పూర్వం ఎన్నో యుగాలు గతించాయి. (అల్లాహ్ ఉపదేశాలు అసత్యాలని) తిరస్కరించే వారి ముగింపు ఎలా జరిగిందో స్వయంగా భూమిపై సంచారం చేసిచూడండి. ఇది ప్రజలకు ఒక స్పష్టమైన హెచ్చరిక. అల్లాహ్‌కు భయపడే వారికి మార్గదర్శకత్వం, హితోపదేశం" (దివ్య ఖుర్‌ఆన్ 3: 133-138)

మరి టీవీల్లో, సినిమాల్లో జిహాద్ అంటే ఎకే 47 పట్టుకుని, "నారే తక్బీర్ అల్లాహు అక్బర్" అంటూ ముస్లిం కాని వారిని విచక్షణ రహితంగా చంపుతారు కదా మరి.

సినిమాలకు, టివి వార్తల్లో చూపే దృశ్యాల్లో ఎంత నిజం ఉంటుంది అందరికీ తెలిసిన సత్యమే. మసాలా దట్టించి మనిషి బలహీనత ను క్యాష్ చేసుకోవడానికి అలా రెచ్చగొట్టే దృశ్యాలు చూపిస్తారు.

అవునవును. 'కేరళ స్టోరీ'లో అలాగే కదా చేసింది.

అవును బాబాయ్. వాస్తవానికి అల్లాహ్ మానవ ప్రాణానికి ఎంతో విలువ ఇవ్వడం జరిగింది.

అన్యాయంగా అధర్మంగా ఒక మనిషి ప్రాణం తీస్తే యావత్ మానవాళి ప్రాణాలు తీసినట్లు, ఒక మనిషి ప్రాణాన్ని కాపాడితే యావత్ మానవాళి ప్రాణాలు కాపాడినట్లు అని ఖురాన్ అల్లాహ్ సెలవిచ్చాడు.

అలాంటిది ఇస్లామ్ అల్లాహ్ పేరుతో అమాయకుల ప్రాణాలను తీయమని ప్రోత్సాహిస్తుందా మీరే ఆలోచించండి.

"శంకరన్న మనిషి అశ్లీల విషయాల వెనుక పరుగులు తీయకుండా, వ్యభిచారపు ఆలోచనలు కూడా మదిలో రాకుండా మరణా నంతరం దైవానికి సమాధానం చెప్పుకోవాలి అని నమ్మి పరమ పవిత్రంగా జీవించడం ముఖ్యమా,లేక విచ్చలవిడిగా శృంగార జీవితం గడుపుతూ సమాజంలో ఎయిడ్స్ లాంటి భయంకరమైన వ్యాధులు వ్యాపింపజేయడం మంచిది నువ్వే చెప్పు?.

పవిత్రమైన జీవితం గడపడమే ముఖ్యం.

"అలాంటి వారికి బహుమానం లబించాలా వద్దా.?"

"తప్పకుండా లభించాలి."

మరి ఇస్లాం అదే కదా చెప్పింది. ధర్మం కోసం అల్లాహ్ కోసం సమాజంలో మంచివారిగా జీవిస్తూ, సమాజంలో మంచి కోసం ప్రాణాలు అర్పించడమే జిహాద్.

ఈ జిహాద్ ఆజ్ఞ కేవలం ఇస్లాం మాత్రమే ఇవ్వలేదు.

## అధికార స్వామ్యం ఆరునెలల కన్నా ఎక్కువ నడవదంటున్న గులాంనబీ ఆజాద్



కాంగ్రెసు నుంచి బయటికి వచ్చి స్వంత పార్టీ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ పెట్టుకున్న గులాం నబీ ఆజాద్ కశ్మీరులో ఎన్నికలు జరపాలని డిమాండ్ మరోసారి చేశారు. 2018లో అసెంబ్లీ రద్దు చేసిన తర్వాతి నుంచి ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఒకటి రెండు సంవత్సరాలు కాదు ఆరేళ్ళుగా జమ్ము కశ్మీర్ ప్రజలు ఎన్నికల కోసం, ప్రజాస్వామిక ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామిక పాలన అంటే ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నడపడమని భారతదేశంలో కాని ప్రపంచంలో ఎక్కడైనా కాని అధికారులు ప్రభుత్వాన్ని నడపడం అనేది ఆరునెలల కన్నా మించి కొనసాగడం కుదరదని అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ గురించి ఆయన మాట్లాడుతూ అదికరణ 370 రద్దు చేసినంత తేలిగ్గా యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావడం కుదరదని చెప్పారు. ఇది కేవలం ముస్లిములకు మాత్రమే సంబంధించిన సమస్య కాదని, సిక్కులు, క్రయిస్తవులు, గిరిజనులు, జైనులు, పార్శీలు అందరికీ అభ్యంతరాలున్నాయని చెప్పారు. ఇలాంటి పని చేయకుండా ఉండడమే మంచిదని ప్రభుత్వానికి సలహా ఇస్తున్నానని అన్నారు.

కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు తన ఎదురుగా ఉన్న అన్న కరుణుడు, విలు విద్య నేర్పిన గురువు, భీష్మ పితామహుడును చూసి వీరితో యుద్ధం చేయడం నా వల్ల కాదు అన్నప్పుడు, శ్రీకృష్ణుడు ఏమన్నాడో తెలుసా? వారు నీ బంధువులు కావచ్చు కానీ వారు అధర్మం పక్షాన ఉన్నారు. నీవు వారిని సంహరించక పోతే ధర్మం నశిస్తుంది అని అన్నాడు.

సృష్టి జీవరాశులలో అత్యుత్తమ జీవి మనిషి. మంచి చెడుల విచక్షణ జ్ఞానం ఉన్న జీవి. సృష్టి లోని అణువణువు ఒక చట్టానికి లోబడి తన మనుగడ సాగిస్తున్నాయి. ఒక్క మనిషి తప్ప. మానవు లకు మాత్రమే ఇవ్వబడిన ఈ స్వేచ్ఛను వినియోగించుకుని తన ఇష్టమైతే సృష్టికర్త ఆదేశాల (చట్టాలకు) అనుగుణంగా జీవించ వచ్చు. లేదా తనకు ఇష్టం వచ్చినట్లు మనుగడ సాగించవచ్చు.

కానీ జాగ్రత్తా! ఈ జీవితం శాశ్వతం కాదు. ప్రాణం ఉన్న ప్రతి జీవికి మరణం తప్పదు. మరణానంతరం మరో జీవితం ఉంది. అది శాశ్వతమైనది. అక్కడ స్వర్గం రూపంలో కోరుకున్నవన్ని లభిస్తాయి అని ఇస్లాం బోధిస్తుంది.

“ఆ స్వర్గం దైవభక్తి, దైవభీతీ కలవారికి వాగ్దానం చేయబడింది, అది వారి కర్మలకు ప్రతిఫలం. వారి ప్రయాణానికి చివరి గమ్యస్థానం, అందులో వారి ప్రతికోరికా తీరుతుంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. దానిని ప్రసాదించటం అనేది నీ ప్రభువు తప్పని సరిగా నెరవేర్చవలసిన ఒక వాగ్దానం.” (దివ్య ఖుర్‌ఆన్ 25:15-16)

మానవుడు ఆశా జీవి. ప్రతిఫలం ఆశించకుండా ఏ పని చేయడు. ఇది అతని సహజ గుణం. మనిషిని సృష్టించిన సృష్టికర్తకు అతని మనస్త త్వానికి అనుగుణంగా ఈ భూమి పై న్యాయం ధర్మం తప్పకుండా మంచి పనులు చేస్తూ జీవించేలా ప్రోత్సాహిం చడం జరిగింది.

“దైవభీతి గలవారు శాంతి భద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యాన వనాలలో, సెలయేళ్లలో, సన్నని పట్టు వస్త్రాలూ, జరీ పట్టు వస్త్రాలూ ధరించి, ఒకరికొకరు ఎదురుగా కూర్చుండి ఉంటారు. ఇలా ఉంటుంది వారి దర్పం. అస పసిమి రంగు మేనులూ, అందమైన విశాలమైన కళ్ళు గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము. అక్కడ వారు రుచికరమైన అన్ని రకాల పదార్థాలనూ నిస్సంకోచంగా అడుగుతారు. అక్కడ వారు మరణాన్ని ఎన్నటికీ రుచి చూడరు. ప్రపంచంలో వచ్చిన మరణమే మరణం. అల్లాహ్ తన కృపతో వారిని నరక శిక్షనుండి కాపాడు తాడు. ఇదే గొప్ప సాఫల్యం.” (దివ్య ఖుర్‌ఆన్ 44:51)

మరి ఆడవారి ఇలాంటి బహుమానం ఉండాలి కదా.

ఆడైనా, మగాడైనా ఎవరు అల్లాహ్‌కు భయపడుతూ మంచి వారిగా న్యాయం ధర్మం తప్పకుండా జీవిస్తే మరణానంతరం శాశ్వత స్వర్గానికి అర్హులుగా కావచ్చు.

లేదు ఈ జీవితమే శాశ్వతం. మరణం తర్వాత మరో జీవితం లేనేలేదు. ఇక్కడ చేసిన పనులకు ఎవరికి సమాధానం చెప్పుకో వలసిన అవసరం లేదు అని జీవిస్తే, అలా జీవించే వారికి క్షణికమైన ఆనందం తప్ప ఏమీ లభించదు. మద్యం తాగితే నీకు నష్టమే. సమాజం లో సాటి మానవులకు నష్టమే. వ్యభిచారం వల్ల రోగాలు, సమాజానికి ఎయిడ్స్ లాంటి రోగాలు అరువుగా ఇవ్వొచ్చు. ఏలా జీవిస్తారో మనిషి ఇష్టం.

స్వర్గంలో మనం కోరుకున్నవన్ని లభిస్తాయి. ఏం రూపంలో ఏది కావాలంటే అది.

❖


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**




# యూనిఫాం సివిల్ కోడ్ పై ముస్లిం పర్సనల్ లా బోర్డు

# అభ్యంతరాలు

**యూనిఫాం సివిల్ కోడ్** పై ముస్లిం పర్సనల్ లా బోర్డు తన ప్రతిస్పందనను లా కమీషన్‌కు పంపించింది. ముస్లిముల వ్యక్తిగత, కుటుంబ సంబంధాలు దైవికమైన దివ్యఖుర్‌ఆన్ చట్టాల ప్రకారం నిర్వహించడం అనేది ముస్లిముల ధార్మిక విశ్వాసానికి సంబంధించిన విషయమని తెలియజేశారు. దేశ రాజ్యాంగం ముస్లిములకు వారి విశ్వాసం ప్రకారం జీవించే హక్కు ఇచ్చిందని, యూనిఫాం సివిల్ కోడ్ వల్ల ఈ హక్కుకు భంగం కలుగుతుందని అన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 25, 26 ప్రకారం మతస్వేచ్ఛ, మతాచారాల స్వేచ్ఛ ఉందని, వివిధ మత సముదాయాలకు భిన్న మతాచారాలు పాటించే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని తెలిపారు. వివక్షలు ఆధునిక చట్టాల్లోను ఉన్నాయని, గోవాలో హిందూ భర్తకు తన భార్య ద్వారా పిల్లలు లేకపోతే, భార్యకు పాతికేళ్ళు దాటిన తర్వాత రెండవ పెళ్ళి చేసుకునే అవకాశం ఉందని, అలాగే భార్యకు 30 ఏళ్ళు వచ్చేవరకు కుమారుడు పుట్టకపోయినా భర్త రెండవ పెళ్ళి చేసుకోవచ్చుని, ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయని అన్నారు. అధికరణ 371ఏ, 371బి, 371సి ఉదాహరిస్తూ బోర్డు మరిన్ని విషయాలు తెలియజేసింది. దేశంలో భిన్నత్వాన్ని కొనసాగించడం రాజ్యాంగ స్ఫూర్తి అని పేర్కొంది. సరళా ముద్గల్, థామస్ కేసుల గురించి ప్రస్తావిస్తూ రెండవ పెళ్ళి కోసం మతం మార్చుకున్న సంఘటన లకు ఇస్లాముకు సంబంధం లేదని, ముస్లిము చట్టాల్లో వివాహం, విడాకులు, వారసత్వం, మహిళలకు వారసత్వ హక్కు అన్ని స్పష్టంగా నిర్వచించబడి ఉన్నాయని చెప్పారు. బహుళత్వం అనేది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయమనీ, సహనం, శాంతియుత సహజీవనాలకు ఇది అవసరమని పేర్కొంది. మినహాయింపులు, విభిన్నతలు కేవలం పర్సనల్ చట్టాల్లోనే కాదు వివిధ రాష్ట్రాల్లోని, వివిధ చట్టాల విషయంలోను కనిపిస్తాయని పేర్కొంది. బంధుత్వ సంబంధాల్లో కూడా వివాహం చేసుకోదగిన సంబంధాల విషయాల్లోను వివిధ రాష్ట్రాల్లో, వివిధ ప్రాంతాల్లో హిందూ ఆచారాల్లోను తేడాలున్నాయని. వివిధ మతాల మధ్య తేడాలున్నాయని పేర్కొంది. బహుభార్యత్వం అనేది ముస్లిం చట్టం లోనే కాదు నాగా తెగల్లోను, గోండులు, బైగాలు, లుషాయిల్లోను ఉందని, కశ్మీర్ నుంచి అస్సాం వరకు ఉన్న హిమాలయ ప్రాంతాల్లో కొన్ని తెగల్లో బహుభర్తృత్వం కూడా ఉందని పేర్కొంది. ఆదర్శ చట్టంగా చెప్పుకునే గోవా కుటుంబ చట్టంలో హిందువు లకు బహుభార్యత్వానికి అనుమతి ఉందని గుర్తు చేసింది. ఇస్లాంలో తలాక్ అనేది సాధారణ విడాకుల భావనకు విభిన్నమైన దని పేర్కొంది. వివాహాన్ని రద్దు చేసే వివిధ పద్ధతుల్లో తలాక్ ఒకటి మాత్రమేనని, తలాక్ లోను వివిధ పద్ధతులున్నాయని, కాని యూనిఫాం సివిల్ కోడ్ ఒకేమాదిరి వివాహ రద్దు ప్రతిపాదనతో ముందుకు వస్తుందని చెప్పింది. యూనిఫాం సివిల్ కోడ్ అనేది ప్రారంభం నుంచి ఒక అయోమయంగానే ఉందని వ్యాఖ్యానించింది.




## మూకహత్యలో పదిమంది హంతకులకు శిక్షలు విధించిన న్యాయస్థానం

ఝార్ఖండ్‌లో ఈ మూకహత్య 2019లో జరిగింది. తబ్రేజ్ అన్సారీ అనే ముస్లింను పట్టుకుని ఒక స్తంభానికి కట్టేసి చావగొట్టారు. చిత్రహింసలకు గురి చేసి మరీ చంపారు. దాదాపు 12 గంటల పాటు ఈ హింసాకాండ జరిగినట్లు తెలిసింది. పది నిముషాల నిడివి కలిగిన వీడియోలో ఇదంతా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వీడియో వైరల్ అయిన తర్వాత దేశవ్యాప్తంగా తీవ్రమైన నిరసనలు వినిపించాయి. ఈ మూకహత్యపై అంతర్జాతీయ మీడియా కూడా ప్రతిస్పందించింది. స్తంభానికి కట్టేసి జై శ్రీరామ్ అనాలని హింసిస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. ఆ తర్వాత పోలీసులు అతన్ని కస్టడీలోకి తీసుకుని ఆసుపత్రికి పంపించారు. ఆసుపత్రిలో అతను మరణించాడు. ఈ సంఘటనపై నిరసనలు పెరిగిన తర్వాత పోలీసులు ఈ సంఘటనకు సంబంధించి 12 మందిని అరెస్టు చేశారు. ఇందులో ఇద్దరిపై తగిన సాక్ష్యాధారాలు లేవని తర్వాత వదిలేశారు. ఈ పదిమందిపై కేసు నడిచింది. కాని ఒక దుర్మార్గపు అమానుష హత్యకు కేవలం పది సంవత్సరాల కారాగార శిక్షను మాత్రమే కారాగారం విధించడాన్ని హతుని భార్య తీవ్రంగా నిరసించారు. అన్సారీ భార్య షాయిస్తా మాట్లాడుతూ ఈ శిక్ష పట్ల తనకు సంతృప్తి లేదని పై కోర్టుకు అప్పీలు చేస్తానని అన్నారు. నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్ష పై కోర్టు విధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మూకహత్యల్లో ఇలాంటి తీర్పులు వస్తే మూకహత్యల్లాంటి అమానుష నేరాలు ఎలా తగ్గుతాయని న్యాయవాది అల్తాఫ్ అన్సారీ అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి దేశంలో విద్వేష నేరాలు పెరుగుతున్నాయని ముఖ్యంగా ముస్లిములపై నేరాలు పెరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గత నెల 32 సంవత్సరాల అఫాన్ అబ్దుల్ అన్సారీ అనే వ్యక్తిని పట్టుకుని కొట్టి చంపేశారు. గోరక్షక దళాల పేరుతో ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు. కారులో ఉన్న మరో ముస్లిం వ్యక్తి కూడా తీవ్ర గాయాలపాలయ్యాడు. మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగింది. మహారాష్ట్రలో ఇప్పుడు బీజేపీదే అధికారమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మాంసం దుకాణం నుంచి మాంసం కొనుక్కుని తీసుకెళుతున్నందుకు వారిపై దాడి జరిగింది. అమెరికాలోని మతస్వేచ్ఛ కమీషన్ వరుసగా నాలుగోసారి భారతదేశాన్ని మతపరమైన స్వేచ్ఛకు సంబంధించి బ్లాక్ లిస్టులో పెట్టాలని సిఫారసు చేసింది. ఇలాంటి మూకహత్యల కేసుల్లో కఠినమైన శిక్షలు పడితేనే ఈ సంఘటనలు ఆగుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాని తక్కువ శిక్షలు వేయడం, శిక్షలు అనుభవిస్తున్న వారికి శిక్షలు రద్దు చేయడం వంటివి జరుగుతున్నప్పుడు ఇలాంటి మతతత్వ విద్వేష నేరాలు ఎలా ఆగుతాయి?

## ముస్లిం అయితే మా ఊళ్ళో ఇల్లు కట్టుకోవడం కుదరదంటున్న మహారాష్ట్ర గ్రామం

మహారాష్ట్రలోని కాత్రాజ్ లో ఉన్న అంబేగాంవ్ గ్రామానికి చెందిన ఖాశీం ముల్లా అనే 73 సంవత్సరాల వృద్ధుడు పదేళ్ళ క్రితం మావాల్ తాలుకాలోని కాంబ్రే నామా ఊళ్ళో 4000 గజాల స్థలం కొనుక్కున్నాడు. ఏప్రిల్‌లో అక్కడ ఒక గది లాంటిది నిర్మించి రిజిస్ట్రేషన్ కోసం ధరఖాస్తు చేసుకున్నాడు. కాని గ్రామ పంచాయతీ ఈ రిజిస్ట్రేషన్ ధరఖాస్తును తిరస్కరించింది. ఎందుకు తిరస్కరించారంటే అతను ముస్లిం కాబట్టి తిరస్కరించారు. ఈ మాటను కాంబ్రే నామా సర్పంచ్ స్వయంగా చెప్పాడు. మా ఊళ్ళో ముస్లిములెవ్వరు ఉండరు. మా ఊళ్ళో ముస్లిముల నివాసాలు మాకు ఇష్టం లేదని చెప్పాడు. మా ఊళ్ళో ముస్లిములు వద్దని పంచాయతీ అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నారట. ఆ స్థలాన్ని అమ్మేసి ఎక్కడికన్నా వెళ్ళిపోవాలని అన్నాడు. ఈ విషయం గురించి తమకేమీ తెలియదని పూనా రూరల్ యస్పీ అంటున్నారు. ఏది ఏమైనా అమెరికాలో మన ప్రధాని గొప్పగా భారతదేశంలో ఎలాంటి వివక్షలు లేవని చేసిన ప్రకటన నేపథ్యంలో ఈ సంఘటనలన్నీ చూడవలసిన అవసరం ఉంది.

## ముస్లిముల పట్ల మరో వివక్ష

వెనుకబడిన వర్గాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకం లక్షరూపాయల నగదు సహాయం పథకంలో బిసి(యి) కేటగిరిని మినహాయించారు. ఈ కేటగిరిలో ఉన్నది ముస్లిములే అన్నది గమనించాలి. బిసి(యి) తరగతికి చెందిన ముస్లిం కుటుంబాలకు ఈ నగదు సహాయం లభించడం లేదు. సనావుల్లా అనే కార్యకర్త ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు ఫలించలేదని అన్నారు. ప్రభుత్వాన్ని ఈ విషయమై కోరినా ఈ సమస్యను మైనారిటీ సంక్షేమ శాఖకు, ప్రభుత్వ సలహాదారుకు పంపించారని చెప్పారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ పథకంలో బిసీ(యీ) కుటుంబాలను చేర్చాలంటే ప్రభుత్వ ఉత్తర్వులో మార్పులు జరగాలని అంటున్నారు. వైయస్సార్ అధికారంలో ఉన్నప్పుడు బిసి(యీ) కేటగిరిని చేర్చారు. ముస్లిముల్లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి ప్రయోజనాలందించడానికి ఈ కేటగిరిని గుర్తించారు. ప్రస్తుత ప్రభుత్వం బిసీలకు ప్రవేశపెట్టిన నగదు సహాయం పథకంలో బిసీ(యీ)లను చేర్చకపోవడం అనేది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం మెజారిటీ మతానికి చెందిన వెనుకబడిన వర్గాలకు మాత్రమే ప్రయోజనాలు కల్పించడానికి ఇలా చేశారని అంటున్నారు.

## మరోసారి ఎన్నికైతే మరింత బలంగా ముస్లిం బ్యాన్ విధిస్తానంటున్న ట్రంప్

అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ మొదటిసారి ఎన్నికైనప్పుడు ఆ ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాల్లో ముస్లిం బ్యాన్ ఒకటి. ట్రంప్ ఓడిపోయిన తర్వాత నుంచి ఈ ముస్లిం బ్యాన్ అనే పదం అంతగా వినిపించడం లేదు. మళ్లీ 2024లో అమెరికాలో ఎన్నికలు జరగవలసి ఉంది. ఈసారి తాను ఎన్నికైతే మరింత బలంగా, మరింత పటిష్టంగా ముస్లిం బ్యాన్ విధిస్తానని ట్రంప్ ఇటీవల ఒక సభలో చెప్పాడు. 2017లో ట్రంప్ ఎన్నికైనప్పుడు ఇరాన్, ఇరాక్, లిబియా, సూడాన్, సిరియా, సోమాలియా, ఎమన్ దేశాల నుంచి ప్రయాణీకులను నిషేధించాడు. అంతే కాదు శరణార్థి కార్యక్రమాలను 120 రోజుల పాటు సస్పెండ్ చేశారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంటనే ఈ ట్రావెల్ బ్యాన్ తొలగించాడు. ఈ ట్రావెల్ బ్యాన్ గురించి గట్టిగా మాట్లాడితే మరోసారి ఎన్నికయ్యే అవకాశాలు పెరుగుతాయని ఇప్పుడు ట్రంప్ భావిస్తున్నాడు.

## దివ్యఖుర్ఆన్ దహనాన్ని నిరసిస్తున్న స్వీడన్ ప్రజానీకం

దివ్యఖుర్ఆన్, బైబిల్ వంటి ధార్మిక గ్రంథాలను బహిరంగంగా దహనం చేయడం వంటి ప్రదర్శనలను నిషేధించాలని స్వీడన్ ప్రజానీకం కోరుకుంటోంది. స్వీడన్ టెలివిజన్ బ్రాడ్ కాస్టర్ SVT సర్వే ఈ విషయాలు తెలియజేసింది. ఇటీవల స్వీడనులో ఒక వ్యక్తి దివ్య ఖుర్ఆన్ దహనానికి పాల్పడిన సంఘటన తర్వాత ఈ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం 53 శాతం మంది బహిరంగ ప్రదేశాల్లో ధార్మిక గ్రంథాలను ఏ మతానివైనా దహనం చేయడాన్ని నిషేధించాలని అభిప్రాయపడ్డారు. కాని 34 శాతం మంది ఇలాంటి నిషేధం అవసరం లేదన్నారు. 13 శాతం మంది ఏ విషయమూ చెప్పలేదు. బక్రీద్ పండుగ రోజున ఒక వ్యక్తి దివ్య ఖుర్ఆన్ దహనానికి పాల్పడ్డాడు. స్వీడన్ పోలీసుల అనుమతితోనే ఇదంతా జరిగింది. ఆ తర్వాతి నుంచి స్వీడనులో నిరసనలు పెల్లుబికాయి. ప్రపంచదేశాల నుంచి తీవ్రమైన ఖండనలు వచ్చాయి. ఆసియా, మధ్యాసియా దేశాలు తీవ్రంగా ప్రతిస్పందించాయి. పోప్ తన ఆగ్రహాన్ని ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి ఈ సంఘటనపై చర్చించడానికి సమావేశం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా పెల్లుబుకుతున్న నిరసన స్వీడను ప్రజలపై ప్రభావం చూపింది. ఈ సంఘటన తర్వాత స్వీడను నాటోలో చేరడానికి చేస్తున్న ప్రయత్నాలను టర్కీ అడ్డుకుంది. ఉక్రెయిన్ పై రష్యా దాడి తర్వాత స్వీడను నాటోలో చేరే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు లేవు. దివ్య ఖుర్ఆన్ దహనం అనేది ఇస్లామోఫోబియా అని స్వీడను ప్రభుత్వం ఒప్పుకుంటుంది.




## పాలస్తీనా విషయంలో పాశ్చాత్య మీడియా అబద్దాల పుట్ట


ఇస్రాయీల్ ఎన్ని దౌర్జన్యాలకు దిగినా, ఎంత హింసాకాండకు పాల్పడినా ఇస్రాయీల్‌ను సమర్థించడానికి చాలా మంది పాశ్చాత్య జర్నలిస్టులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారు. జెనిన్ శరణార్థి శిబిరంలో పాలస్తీనా పిల్లలు, మహిళలతో సహా 14 వేల మందిపై ఇస్రాయీల్ సైన్యం దాడి చేసిన సంఘటన విషయంలోను పాశ్చాత్య మీడియా అబద్దాలే చెప్పింది. ఇస్రాయీల్ దుర్మార్గం జాత్యాహంకారం, మిలిటెన్సీ అని చెప్పడానికి పాశ్చాత్య మీడియా సిద్ధంగా లేదు. ఇస్రాయీల్ సైన్యం నిరాయుధులపై దాడి చేసిందని చెప్పడానికి కూడా సిద్ధంగా లేదు. దానికి బదులుగా అబద్దాలు చెబుతున్నారు. వెస్ట్ బ్యాంకులో దుర్మార్గంగా ఆక్రమించుకున్న ప్రాంతంలో రెండువేల మంది ఇస్రాయీల్ సైనికులు సాయుధ శకటాలు డ్రోన్లు రాకెట్లు, హెలికాప్టర్ గన్ షిప్పులతో పాలస్తీనీయులపై దాడి చేశారు. ఈ దాడి రెండు రోజుల పాటు కొనసాగింది. కాని న్యూయార్క్ టైమ్స్, సిఎన్ఎన్ వంటి వార్తా సంస్థలు దీన్ని దాడిగా చెప్పలేదు. ఇది ఒక "ఆపరేషన్" అని పేర్కొన్నారు. సైనిక ఆపరేషన్ అని చెప్పడం అంటే ఇస్రాయీల్ దుర్మార్గాన్ని కప్పిపుచ్చడమే. ఆపరేషన్ అనే పదంలో చట్టబద్ధత ధ్వనిస్తుంది. కాని అక్కడ జరిగింది దుర్మార్గమైన దాడి. జెనిన్‌లో ప్రజలపై దాడులు చేశారు. 12 మంది మరణించారు. ఇందులో పిల్లలు కూడా ఉన్నారు. ఇండ్లు ధ్వంసం చేశారు. దుకాణాలు ధ్వంసమయ్యాయి. శరణార్థులు అక్కడి నుంచి ప్రాణాలరచేతబట్టుకుని పారిపోవలసి వచ్చింది. అయినా పాశ్చాత్య మీడియాకు ఇది ఒక ఆపరేషన్ మాత్రమే. నిజానికి జెనిన్‌పై జరిగిన దాడి జాత్యాహంకారంతో చేసిన దాడి అని స్పష్టంగా తెలుస్తోంది. కెనడాలోని ది గ్లోబ్ అండ్ మెయిల్ పత్రిక ఇస్రాయీల్ దౌర్జన్యాలను అత్యంత మృదువైన భాషలో రాసింది. వెస్ట్ బ్యాంకు నుంచి ఇస్రాయీల్ దళాలను ప్రస్తుతం వెనక్కు పిలిచిందని, రెండు రోజుల ఆపరేషన్ చివరిది కాదన్న హెచ్చరికను జారీ చేసిందని రాసింది. అంటే పాలస్తీనీయులపై ఇస్రాయీల్ చేసిన దాడిని ఒకవిధంగా సమర్థించడమూ, పాలస్తీనీయులు ఇస్రాయీల్ మాట వినకపోతే మరో దాడి తప్పదని హెచ్చరించడమూ రెండు ఉననాయి. పాశ్చాత్య మీడియా అబద్దాలు ద్వంద్వ ప్రమాణాలు జెనిన్ దుర్మార్గపు దాడిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అల్ జజీరా జర్నలిస్టు అండ్రూ మిట్రోవికా పాశ్చాత్య మీడియా దుర్మార్గపు వైఖరిని తీవ్రంగా దుయ్యబడుతూ రాశారు.

# మహిళలకు మంచి నగరాలు

**చాలా** మంది ప్రయాణాలు చేస్తుంటారు. చాలా మంది మిత్రులతో కలిసి, కుటుంబంతో, బంధువులతో కలిసి ప్రయాణం చేస్తుంటారు. కాని కొందరు ఒంటరిగా ప్రయాణం చేయాలను కుంటారు. కాని ఒంటరి ప్రయాణీకులకు భద్రత సమస్య ఎదురవు తుంది. మరీ ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయాలంటే భద్రత ముఖ్యమైన సమస్యగా మారుతుంది. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఒంటరి మహిళల ప్రయాణ భద్రత గురించి ఇంటర్నెట్‌లో వెదకడం 99శాతం పెరిగిందని ట్రావెల్ సంస్థ ఇన్ సెక్యూర్ మై ట్రిప్ డాట్ కామ్ తెలిపింది. కాండోర్ ఫెర్రీస్ అనే సంస్థ పరిశోధన ప్రకారం ఒంటరిగా ప్రయాణాలు చేసేవారిలో 84 శాతం మహిళలే ఉన్నారు. ముఖ్యంగా అమెరికా మహిళలు 72 శాతం మంది ఒంటరిగా ప్రయాణాలు చేయాలనుకుంటున్నారని తెలిసింది. ఇన్ సెక్యూర్ మై ట్రిప్ ట్రావెల్ సంస్థ ఒంటరిగా ప్రయాణం చేసే మహిళలకు సురక్షితమైన నగరాలేవో సర్వే చేసింది. ప్రపంచంలోని 65 నగరాల్లో ఈ సర్వే జరిగింది. ఈ సర్వే ప్రకారం తెలిసిన వాస్తవాలు ఆశ్చర్య కరంగా ఉన్నాయి. గొప్పగా చెప్పుకునే పాశ్చాత్యదేశాల కన్నా అరబ్బు దేశాలు ఈ విషయంలో మిన్నగా ఉన్నాయి. ఒంటరిగా ప్రయా ణాలు చేసే మహిళలకు సురక్షితమైన నగరాల జాబితా ఈ సర్వే ప్రకారం తయారు చేశారు. ఆ జాబితాలో అన్నింటికన్నా పై భాగాన ఉన్న నగరం దుబాయ్. దుబాయ్ మొత్తం 8.12 పాయింట్లు సాధించింది. గత సంవత్సరం దుబాయ్ స్కోరు 7 పాయింట్లు మాత్రమే. స్పెయిన్‌లోని మాడ్రిడ్ నగరం మూడవస్థానంలో 7.79 పాయింట్లు నమోదు చేసింది. గత సంవత్సరం 60వ స్థానంలో ఉన్న సౌదీ అరేబియా నగరం రియాద్ ఈ సంవత్సరం 24వ స్థానానికి చేరుకుంది. సౌదీ అరేబియాలోని మదీనా నగరం 7వ స్థానంలో ఉంది. ఫ్రాన్సులోని పారిస్ నగరం 57వ స్థానంలో ఉంది. డాటా ప్రకారం సౌదీ అరేబియాలోని మదీనా నగరం అర్థరాత్రి కూడా ఒంటరి మహిళ సురక్షితంగా నడిచే నగరంగా గుర్తింపు పొందింది. స్త్రీలపై దాడులు జరిగే అవకాశాలు మదీనాలో చాలా తక్కువగా సర్వేలో తెలిసింది. మహిళలకు సురక్షితమైన నగరాల జాబితాలో రెండవ స్థానంలో థాయిలాండ్ కు చెందిన చియాంగ్ మాయ్ నగరం ఉంటే మూడవస్థానంలో మరో అరబ్బు నగరం దుబాయ్ ఉంది. మహిళలకు భద్రతల అస్సలు లేని నగరాల జాబితాలుగా దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ బర్గ్, మలేషియాలోని కౌలాలంపూర్ ముద్రపడ్డాయి. మూడవ స్థానంలో పారిస్ ఉంది. టూరిజం విషయంలో చూస్తే దుబాయ్ మొదటి స్థానానికి చేరుకుంది. రెండవ స్థానంలో న్యూయార్క్ ఉంది. ప్రయాణ ఖర్చులు చాలా తక్కువగా ఉన్న నగరాలను చూస్తే మొదటి స్థానంలో జైపూర్ నగరం, రెండవ స్థానంలో చెన్నై నగరం ఉన్నాయి. మూడవ స్థానంలో టర్కీలోని అంటాలియా నగరం ఉంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం కూడా మహిళలకు సురక్షితమైన నగరం దుబాయ్. ఈ నగరాన్ని సందర్శించిన అనేకమంది అభిప్రాయం కూడా ఇదే. ఏది ఏమైనా మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల జాబితాలో దుబాయ్, మదీనా, రియాద్ వంటి అరబ్బు నగరాలు గొప్ప ర్యాంకును సాధించుకోవడం ఇస్లామ్‌లో మహిళల స్థానం గురించి విమర్శలు చేసేవారికి ఒక జవాబుగా భావించవచ్చు.

❖

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**